
# పావురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 25-10-2024 15/-


## భగ్గుమన్న బహ్రైచ్





అవినీతే పేదరికానికి మూలం



సహజీవన భావాల పావురాయి
గీటురాయి
వారపత్రిక
GEETURAI WEEKLY
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 43 హైదరాబాద్
శుక్రవారం 25 అక్టోబర్ 2024 రూ.15-00
21 రబీ ఉస్సాని 1446 హిజ్రీ

**తొలిగీటు**

జబ్బు చేసిన వారి (బాగోగులను)ని వాకబు చేయండి.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**




## లోపల...

| | | |
|---|---|---|
| ఇస్రాయీల్ దాష్టీకం | ...... | 04 |
| భగ్గుమన్న బహ్రైచ్ | ...... | 05 |
| నోరు అదుపులో లేకుంటే అన్నీ అనర్థాలే! | ...... | 07 |
| దేవుని బెబ్బులి!! - 51 | ...... | 08 |
| చరితార్థులు-2 : నవాబ్ ఖాజా అతీఖుల్లాహ్ | ...... | 11 |
| అవినీతే పేదరికానికి మూలం | ...... | 12 |
| గులాబీ నోటుకు కాలం చెల్లింది | ...... | 14 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| శిక్షకునిగా, మార్గదర్శిగా మహాప్రవక్త ముహమ్మద్ (స) | ...... | 24 |
| జాబిర్ ఇబ్నుల్ హయ్యాన్ | ...... | 26 |
| ప్రవక్త ప్రవచనం పరమౌషధం | ...... | 28 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| ముద్దాయిగా ఖలీఫా | ...... | 34 |

**మళ్ళీ పోరు...**




మరో రెండు రాష్ట్రాలకు
మోగిందోయ్ నగారా
వండివార్చి పెడతారిక
ప్రలోభముల బగారా!
అభివృద్ధి ఊసుండదు
కులం మతం ఆయుధం
ప్రజల మధ్య చిచ్చుబెట్టి
పవరు కొరకు యుద్ధం!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

## ఆలోచన

# ఇస్రాయీల్ దాష్టీకం

**హమాస్, హిజ్బుల్లా, హూతీ,** ఈరాన్‌లతో పాటు ఇప్పుడు కొత్త లక్ష్యాలపై కూడా దాడులు మొదలు పెట్టింది. గాజాలో, లెబనాన్‌లో ఇష్టారాజ్యంగా బాంబుల వర్షం కురిపిస్తున్న ఇస్రాయీల్, వెస్ట్ బ్యాంకులో కూడా పలస్తీనీయులపై దాడులు చేసింది. అంతేకాదు, ఐక్యరాజ్య సమితి శాంతిదళాలపై కూడా దాడులు చేస్తోంది. లెబనాన్‌లో ఉన్న ఐక్యరాజ్య సమితి శాంతిదళానికి చెందిన కనీసం ఐదుగురు సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. దక్షిణ లెబనాన్ లో ఇస్రాయీల్ సరిహద్దుల వద్ద విధులు నిర్వహిస్తున్న ఐక్యరాజ్యసమితి శాంతిదళం సైనికులపై ఇస్రాయీల్ దాడులు చేసింది. అంతేకాదు ఇస్రాయీల్ సైనికులు బలవంతంగా ఐక్యరాజ్య సమితి దళాల స్థావరంలోకి ప్రవేశించారని తెలుస్తోంది. ఐక్యరాజ్య సమితి వాచ్ టవర్లను, కెమెరాలను లక్ష్యంగా చేసుకుని ఇస్రాయీల్ దాడులు చేస్తుందని ఇంతకు ముందు ఐక్యరాజ్య సమితి ఆరోపించింది. ఐక్యరాజ్య సమితి శాంతిదళాన్ని లెబనాన్‌లో ఉన్న హిజ్బుల్లా మానవ కవచంగా వాడుకుంటుందని ఇస్రాయీల్ విమర్శిస్తోంది. కాని ఈ మాటలను ఎవరు నమ్మ డమూ లేదు, ఈ సాకు నమ్మశక్యం కాని సాకు అన్నది అంతర్జాతీయంగా ఇప్పుడు స్పష్టమైన సత్యం.

ఇస్రాయీల్ ఉద్దేశ్యపూర్వకంగా ఐక్యరాజ్య సమితి శాంతిదళాలపై దాడులు చేస్తుందని ఐక్యరాజ్య సమితి ఆరోపించింది. యుద్ధసమయాల్లో అయినా సరే ఐక్యరాజ్యసమితి శాంతిదళంపై దాడులు చేయడం అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించడమే. లెబనాన్ భూభాగాల్లో ఇస్రాయీల్ సైన్యం ప్రవేశించిన తర్వాత ఇస్రాయీల్ ప్రధాని నెతన్యాహు ఐక్యరాజ్యసమితి శాంతిదళాలను అక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేయడాన్ని కూడా అంతర్జాతీయ పరిశీలకులు తప్పుపడుతున్నారు.

ఈ నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి శాంతిదళాలపై ఇస్రాయీల్ దాడులకు పాల్పడడాన్ని భారతదేశం ఎలా చూస్తుంది? ఎలా ప్రతిస్పందిస్తుందన్నది చాలా కీలకమైన అంశం. ఐక్యరాజ్యసమితి శాంతి దళాల్లో భారత దేశం ప్రముఖ పాత్ర పోషిస్తోంది. లెబనాన్ తో సహా ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో శాంతిని కాపాడ్డానికి ఐక్యరాజ్య సమితి ప్రయత్నాల్లో భారతదేశం భాగస్వామ్యం కీలకమైనది. లెబనాన్ లో శాంతిపరిరక్షక దళాలపై దాడులను భారతదేశం ఖండించింది. అయితే ఈ విషయంలో భారతదేశం మరింత గట్టిగా వ్యవహరించవలసి ఉంది. నెతన్యాహుతో ఉన్న మైత్రిని ప్రధాని మోడీ ఉపయోగించు కుని ఒత్తిడి తీసుకురావాలి. శాంతి దళాలపై దాడులను మిత్రులు కూడా హర్షించరన్న విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలి. ప్రపంచచరిత్రలో ఎక్కడా లేనంతగా ఐక్యరాజ్య సమితి సిబ్బంది గాజా యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. ఐక్యరాజ్య సమితి నిర్వహిస్తున్న స్కూళ్ళపై కూడా బాంబులు వేసింది. ఐక్యరాజ్య సమితి ప్రధానకార్యదర్శి గుటెరస్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసింది. ఐక్యరాజ్య సమితిపై ఆరోపణలు సంధించింది.

ఇస్రాయీల్ ఇప్పుడు ఐక్యరాజ్య సమితిపై కూడా యుద్ధం చేయాలని పూనుకుంటున్నట్లయితే అంతర్జా తీయ చట్టాన్ని గౌరవించే దేశాలు దీనిపై ప్రతిస్పందించాలి. ఇస్రాయీల్‌ను అదుపు చేయడానికి ప్రయత్నించాలి. అలా జరక్కపోతే అంతర్జాతీయ చట్టానికి విలువ ఉండదు. చట్టాన్ని వ్యతిరేకించడం సర్వసామాన్యమై పోతుంది.

అబ్దుల్ వాహెద్

# భగ్గుమన్న బహ్రైచ్



ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ చాలా సార్లు తన పరిపాలన గురించి దంగా ముక్త్ అంటే అల్లర్లు లేని రాష్ట్రం అని చెప్పుకునేవారు. ఈ వాదనలో డొల్లతనాన్ని ఇంతకు ముందు కూడా అనేక సందర్భాల్లో అనేకమంది అనేక ఉదాహరణలతో స్పష్టం చేశారు. ఇప్పుడు సరికొత్తగా బహ్రైచ్‌లో జరిగిన అల్లర్లు ఈ వాస్తవాన్నే మరోసారి స్పష్టం చేస్తున్నాయి.

తన పరిపాలనలో అల్లర్లనేవి లేవనే మాటను యోగీ ఆదిత్యనాథ్ గతంలో కూడా చాలా సార్లు చెప్పారు. రెండేళ్ళ క్రితం ఆయన ఈ మాటలు చెప్పినప్పుడు 2017 నుంచి 2021 మధ్య కాలంలో ఉత్తరప్రదేశ్‌లో అల్లర్ల సంఘటనలకు సంబంధించి 35 వేలకు పైబడి కేసులు నమోదయ్యాయని జాతీయ నేర గణాంకాల నుంచి కొందరు ఉదాహరించారు. యోగి పరిపాలనా కాలంలో 2017 నుంచి 2021 మధ్య 35 అల్లర్ల సంఘటనలు జరిగాయని కూడా తెలియజేశారు. క్వింట్ వార్తా సంస్థ ఏప్రిల్ 2023 వ్యాసంలో కూడా ఈ వాస్తవాలు తెలియజేసింది. 2020లో పౌరసత్వ సవరణ చట్టంపై నిరసనల సందర్భంగా కూడా అల్లర్లు జరిగాయి.

యోగీ ఆదిత్యనాథ్ తన హయాంలో పండుగలు పబ్బాల ఊరేగింపులు ప్రశాంతంగా జరుగుతున్నాయని చెప్పుకోవడం మామూలే. కాని 2019 మార్చిలో హెూలీ వేడుకల సందర్భంగా అల్లర్లు జరిగాయి. 2018 సెప్టెంబరులో గోరక్‌పూర్‌లో ముహర్రం సందర్భంగా అల్లర్లు జరిగాయి. కాని అబద్దాలు చెప్పడం మామూలుగా మారిన నేటి రాజకీయ వాతావరణంలో తన పరిపాలనలో అల్లర్లే జరగవని యోగీ చెప్పడంలో ఆశ్చర్యం లేదు.

కాని ఇప్పుడు బహ్రైచ్‌లో జరిగిన అల్లర్ల విషయంలో ఏమంటారు? ఈ అల్లర్లలో బాధితులు ముఖ్యంగా ముస్లిములే. యోగీ ప్రభుత్వం అల్లర్లను అడ్డుకోవడంలో విఫలమైందని మాయావతి విమర్శించారు. సమాజవాది పార్టీ నుంచి కూడా తీవ్ర విమర్శ వచ్చింది. ఒక్క ఉత్తరప్రదేశ్ మాత్రమే కాదు అనేక ఇతర రాష్ట్రాల్లో కూడా బీజేపీ పరిపాలన అస్తవ్యస్తంగా ఉందని కాంగ్రెస్ విమర్శించింది. హింస, విద్వేషాలను అనుమతించి ఓట్ల కోసం ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ ప్రతినిధి ఆరోపించారు.

బహ్రైచ్ అల్లర్ల తర్వాత ముఖ్యంగా ముస్లిములే లక్ష్యంగా అరెస్టులు జరుగుతున్నాయన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. హింసాకాండకు కారణమైన అసలు దోషులను వదిలి, అమాయకులను టార్గెట్ చేస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

బహ్రైచ్ అల్లర్లు విధ్వంసాన్ని సృష్టించాయి. ముఖ్యంగా ముస్లిములపైనే దాడులు జరిగాయి. దహనాలు, లూటీలు, విధ్వంసాలు యధేచ్ఛగా జరిగాయి. నిజానికి బహ్రైచ్ జిల్లాలో ఎన్నడూ ఉద్రిక్తతలు లేవు. కాని సోషల్ మీడియాలో ఫేక్ వార్తల ప్రచారం ఉద్రిక్తతలకు దారితీసిందని తెలుస్తోంది. అల్లర్లలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. నిర్వాసితులయ్యారు. కష్టపడి కట్టుకున్న ఇళ్ళు, దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. అల్లర్లను అదుపుచేయడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

ఉత్తరప్రదేశ్‌లో యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వ విధానాలు, శాంతిభద్రతలను కాపాడే పద్ధతి, బుల్డోజర్ ప్రయోగాలు, ఎన్‌కౌంటర్లను చాలా మంది విమర్శిస్తూనే వస్తున్నారు.

గత సంవత్సరం సహరాన్‌పూర్‌లో మాట్లాడుతూ యోగీ ఆదిత్యనాథ్ తన పరిపాలనలో కర్ఫ్యూలు, అల్లర్లు లేవన్నారు. మొన్న లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కూడా ఆయన ఈ మాటలే గొప్పగా చెప్పుకున్నాడు. సమాజవాది పార్టీ పరిపాలనలో మత కలహాలు జరిగేవన్నట్లు మాట్లాడారు.

మతపరమైన ఊరేగింపులో డిజే లౌడ్ మ్యూజిక్‌తో వినిపించిన పాటలేమిటి? అవి రెచ్చగొట్టే పాటలు కాదా? ఈ పాటలతో ఒక సముదాయాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నాలు జరుగుతుంటే అక్కడి పోలీసులు ఏం చేశారు? వంటి అనేక ప్రశ్నలు ఇప్పుడు ముందుకు వస్తున్నాయి. ఈ పాటలకు అభ్యంతర పెట్టడం, ఘర్షణ పరిస్థితి తలెత్తుతున్నప్పుడు అక్కడే ఉన్న పోలీసులు ఏం చేశారు? కాని పోలీసులు తమాషా చూశారన్న ఆరోపణ బలంగా వినిపిస్తోంది.

ఈ మతపరమైన ఊరేగింపు జరుగుతున్నప్పుడు ఏ మార్గం నుంచి వెళ్లాలన్న అనుమతులు ఇస్తున్నప్పుడు పోలీసులు ఎందుకు జాగ్రత్తలు తీసుకోలేదన్న ప్రశ్న కూడా వినిపిస్తోంది. అఖిలేష్ యాదవ్ ఈ ప్రశ్నలను సూటిగా అడిగారు. ఊరేగింపులో మ్యూజిక్ సిస్టమ్‌లో వినిపించిన పాటలేమిటి? అవి రెచ్చగొట్టే పాటలు కాదా అని ఆయన నిలదీశారు. వీటన్నింటిని చూసుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఉప ఎన్నికలు జరగబోతున్నాయి. ఇప్పుడు రాష్ట్రంలో మతపరమైన ఉద్రిక్తతలు తలెత్తడం యాధృచ్ఛికం కాదని ఒక ట్వీటులో చెప్పారాయన. ప్రజలు అన్నీ చూస్తున్నారని, ఓటమి భయంతో హింసాకాండకు పాల్పడేవారెవ్వరో ప్రజలకు తెలుసని చెప్పారు.

బహ్రైచ్ అల్లర్ల తర్వాత ఉత్తరప్రదేశ్ ఉపముఖ్యమంత్రి ఈ అల్లర్ల వెనుక కుట్ర ఉందని, రాష్ట్రంలో శాంతిభద్రతలను దెబ్బతీయడానికి పన్నిన కుట్ర అన్నారు.

ఈ ఊరేగింపులో అనుచితమైన పాటలతో హోరెత్తించిన వారిలో నలుగురిని అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. మస్జిదు ముందు ఈ పాటలతో హోరెత్తించారు. అంతేకాదు చెప్పులు, బూట్లు కూడా విసిరినట్లు ఎఫ్ఐఆర్‌లో నమోదైంది.

ఏది ఏమైనా ఇప్పుడు ఎన్నికలకు ముందు మతపరమైన ఉద్రిక్తతలు రెచ్చగొట్టే ప్రయత్నాలు జోరుగా జరుగుతున్నాయి. ఇప్పుడు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం థూక్ జిహాద్‌పై మార్గదర్శక సూత్రాలు జారీ చేసిందంట. కొంతకాలం క్రితం పండ్లు అమ్ముకునే వాళ్ళు తమ పేరు స్పష్టంగా రాసి బోర్డు పెట్టాలని ఒక ఆదేశం తీసుకువచ్చారు. ఇదే ఆదేశం హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ నాయకులు కూడా తీసుకువస్తామన్నారు. బహ్రైచ్ అల్లర్లపై రిపోర్టింగ్ చేస్తున్న ముస్లిం రిపోర్టర్ల పేర్ల జాబితాను బీజేపీ ఎమ్మెల్యే ప్రకటిస్తూ, వీళ్ళంతా అబద్ధాలు రాస్తారన్నాడు.

ఏది ఏమైనా ఎన్నికలు వస్తున్నప్పుడు, ఎన్నికల ప్రచారంలో మతభావాలను రెచ్చగొట్టడం, ఉద్రిక్తపరిస్థితులు సృష్టించడం ద్వారా రాజకీయ ప్రయోజనాలు సాధించుకునే ఈ ప్రయత్నాలను ప్రజలు గమనించి, ఎన్నికల్లో తగిన జవాబు చెప్పవలసిన అవసరం ఉంది.

★★★



# నోరు అదుపులో లేకుంటే అన్నీ అనర్ధాలే

యం.డి. ఉస్మాన్‌ఖాన్

**ఒకసారి, హజ్రత్ ముఆజ్ (ర) అనే సహాబీ, అంటే ప్రవక్త వారి సహచరుడు ముహమ్మద్ ప్రవక్త(స) వారిని ఇలా అడిగారు. 'అయ్యా..! నేను స్వర్గంలోకి ప్రవేశించగలిగే ఏదైనా ఒక ఆచరణను ఉపదేశించండి.' అని విన్నవించుకున్నాడు.**

**అప్పుడు దైవప్రవక్త ముహమ్మద్ (స) 'ముఆజ్! నువ్వు చాలా గొప్ప విషయం అడిగావు. అయితే విను. అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించు. మనసు లగ్నం చేసి దైవారాధన చెయ్యి. జకాత్ చెల్లిస్తూ ఉండు. రమజాన్ నెలలో ఉపవాసాలు పాటించు. స్థోమత ఉంటే కాబా గృహాన్ని సందర్శించు అని చెబుతూ... చివరిగా తన నాలుకను పట్టుకొని, 'ఇదిగో... దీన్ని అదుపులో ఉంచుకో' అని ఉపదేశించారు.**

ఈ ఉపదేశం విని సహచరుడు ముఆజ్, 'దైవప్రవక్తా! ఏదో ఒక విషయమై మనం మాట్లాడుతూనే ఉంటాం కదా..! మరి దీన్ని గురించి కూడా ప్రశ్నించడం జరుగుతుందా?' అని తన సందేహాన్ని వ్యక్తపరిచాడు.

అప్పుడు ప్రవక్త మహనీయులు, 'ముఆజ్! నిత్య జీవితంలో అవసరమైన మాటలు, మానవ సమాజానికి మేలు కలిగించే విషయాలు, సంఘ సంస్కరణకు సంబంధించిన ధర్మబద్ధ సంభాషణలు తప్ప, ఉబుసుపోక కబుర్లు, అయిన దానికి, కాని దానికి, అడ్డగోలుగా, అసభ్యంగా, బాధ్యతా రాహిత్యంగా, భయమూ భక్తి లేకుండా మాట్లాడే విషయాలన్నీ మానవుల్ని బోర్లా పడేసి, నరకంలోకి ఈడ్చుకొని పోయేవే' అని సెలవిచ్చారు.

ఈ రోజు సమాజ పోకడలను మనం గమనించినట్లయితే, ప్రతి నిత్యం సంభవించే అనేక అనర్ధాలకు నోటి దురుసుతనం, అతి వాగుడే ప్రధాన కారణం అంటే అతిశయోక్తిలేదు. కేవలం నోటిని అదుపులో ఉంచుకో లేని కారణంగా, నోరు జారడం వల్ల ఎన్ని అనర్ధాలు జరుగుతున్నాయో మనకు తెలియనిది కాదు. అందుకే నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది అన్నారు విజ్ఞులు. మనిషి పాపాల్లో కూరుకుపోయే కారణాల్లో అధిక శాతం నోటి ద్వారా సంభవించే అనర్ధాలే. అందుకే ప్రవక్త మహనీయులు నోటిని అదుపులో ఉంచుకోవాలని చాలా గట్టిగా ఆదేశించారు. చెడు విషయాలు మాత్రమే కాదు, అవసరం లేని మాటలు, ఎలాంటి ప్రయోజనం చేకూర్చని ప్రేలాపనల నుండి నోటిని సురక్షితంగా ఉంచుకోవాలన్నారు. మాట్లాడే అవసరం లేకపోతే, మాట్లాడినా ప్రయోజనం లేదని తెలిసిపోతే మౌనంగా ఉండడమే అన్ని విధాలా శ్రేయస్కరం. ఇదే ముక్తి, మోక్షాలకు సాధనమని సెలవిచ్చారు. దైవం మనందరినీ సమస్త అనర్ధాల నుండీ కాపాడాలని, ఇహ పరలోకాల్లో సాఫల్యం ప్రసాదించాలనీ కోరుకుందాం.

అధ్యాయం -19

51

## 1. జ్ఞాన ఖని!

# దేవుని బెబ్బులి!!

ఎస్.ఎం. మలిక్

## మహనీయ అలీ(ర) అమరగతి

ముస్లిములలో విభేదాలు, విచ్ఛిన్నం, కాపట్యం గమనించి తీవ్ర వాదులు, మతి తప్పినవారు, ఖారిజీలు, అబ్దుర్రహ్మాన్, బర్క్, అమ్ర్ ముగ్గురు తమలో తాము సంప్రతించుకుని, ఈ విపత్తుకు అసలు బాధ్యులయిన వారు మహనీయులు అలీ, ముఆవియ, అమ్ర్ బిన్ ఆస్(ర) ముగ్గురని తేల్చుకున్నారు. ఈ ముగ్గురిని రాజకీయ వేదిక నుంచి తొలగిస్తే అంతా సద్దుమణుగుతుందని నిర్ణయించుకున్నారు. కనుక వీరిని తాము ఒక్కొక్కరే ఒక్కొక్కరిని చంపివేసే బాధ్యత తీసుకోవాలని అనుకున్నారు.

అబ్దుర్రహ్మాన్ మహనీయ అలీ(ర)ని హతమార్చాలని, బరక్ మహనీయ ముఆవియని, అమ్ర్ మహనీయ అమ్ర్ బిన్ ఆస్‌ని అంతమొందించాలని తీర్మానించుకున్నారు. ఖారిజీలయిన ఈ ముగ్గురు వారిని హతమార్చడమో లేదా తామే హత్య కావడమో తేలిపోవాలనుకున్నారు. ముగ్గురున్నూ హిజ్రీ 40వ సంవత్సరం రమజాన్ 15వ తేదీన ఫజ్ర్ సమయాన ఒకేసారి, కూఫా, డెమాస్కస్, ఈజిప్టులో ఈ హత్యలు జరగాలని కూడా నిర్ణయించుకున్నారు.

కాగా, అబ్దుర్రహ్మాన్ నిర్ణీత తేదీన మహనీయ అలీ(ర) నమాజ్ చేయించే మస్జిద్‌కు వెళ్ళి మాటు కాసి కూర్చున్నాడు. ఆయన నమాజ్ చేయించడానికి వచ్చినప్పుడు కరవాలంతో తల మీద దెబ్బ వేశాడు. వెంటనే జనం అతన్ని పట్టుకున్నారు. గాయం గట్టిగా తగలటం వల్ల ఆయన మూడవ రోజు పరమపదించారు. ఆయన ఖిలాఫత్ నాలుగేళ్ల ఎనిమిది నెలల ఇరువై రోజులు మనగలిగింది.

***ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్***

### సంతానం

ఆయన(ర) తన సతీమణి, ప్రవక్త కూతురు, మహనీయ ఫాతిమా(ర) బ్రతికి ఉన్నంతకాలం మరో వివాహం చేసుకోలేదు. ఆమె ద్వారా ఆయనకు ఇద్దరు కుమారులు, మహనీయులు హసన్, హుసైన్(ర), ఇద్దరే కుమార్తెలు, జైనబ్, ఉమ్మె కుల్సూమ్ కలిగారు. ఇతర భార్యల ద్వారా కలిగిన సంతానం వేరే. ఆయనకు మహనీయ ఫాతిమా(ర) ద్వారా కలిగిన నలుగురు సంతానం, వారి ద్వారా ఏర్పడిన

సంతానం యావత్తు సాదాత్ అనబడతారు. ఇతర సతీ మణుల సంతానం అలవీ అనబడతారు.

## గుణ గణాలు

మహనీయ అలీ(ర) చిరుప్రాయం నుంచి కారుణ్య స్వరూపుని (స) క్రీనీడలో పెరిగారు. అందువల్ల ప్రవక్త గుణాలు ఆయనలో ప్రస్ఫుటంగా కానవచ్చేవి. ప్రవక్తశ్రీ (స) పరమ పదించిన సమయాన ఆయన వయసు 31 సంవత్సరాలు. కాని జ్ఞానం, దూరదృష్టి రీత్యా ఆయన వయసుమీరిన సహచరులకు ఏ మాత్రం తీసిపోరు. కుర్ఆన్ వ్యాఖ్యానం, ప్రవక్త సంప్రదాయం, దైనందిన సమస్యలకు సమాధానం కనుగొనడంలో ఆయన అందె వేసిన చేయి.

ఇస్లామ్ వ్యతిరేక శక్తులతో తలపడవలసి వచ్చినప్పుడు ఆయన ధైర్యసాహసాలు, శౌర్యాలు అనన్యంగా ముందుకు వచ్చాయి. పోరాటాల్లో కఠిన సందర్భాలు ఎదురయినప్పుడు ఆయనలో ఉద్విగ్నత కట్టలు తెంచుకుని పెల్లుబికేది. ఎంతో ప్రతాపం గల వీరులు సయితం ఆయన్ని ఎదుర్కొనేందుకు జంకేవారు.

ఆయన నైతిక మహత్తు, భయభక్తులు కూడా అత్యున్నత స్థాయిలో దర్శనమిచ్చేవి. ఆయన జీవితమే దైవం పైన గట్టి నమ్మకం, సంతుష్టి, సంతృప్తులతో అలరారేది. ఆయన నిరుపేదగానూ, సంపత్తి గలవారు గానూ బతికారు. ఏ కాలంలోనూ ఆయన 'అతి' అన్న దాన్ని దరిచేరనీయలేదు, అసంతులనం రానివ్వలేదు.

దైవ ధ్యానం, ఆరాధనలు ఎన్ని జరిగినా ఆయన తృష్ణ తీరేది కాదు. ఒక ఉల్లేఖనం ప్రకారం, బనీ హాషిమ్ ముస్లిములలో ఆయనకు మించిన రేయి ఆరాధకులు మరెవరూ లేకపోయారు. విశ్వాసుల మాతృమూర్తి మహనీయ ఆయిషా(ర) ఆయన గురించి ఇలా అన్నారు, "ఆయన (అలీ) రాత్రిళ్ళు ఆరాధనలోనూ పగలు ఉపవాస వ్రతంలోనూ గడిపే వారు."

## సత్య వాదన

మహనీయ ఆయిషా(ర) పైన అపవాదులు వేసినప్పుడు మహనీయ అలీ(ర) కేవలం సూత్రప్రాయమయిన మాట పలికారు. అపవాదాన్ని బలపరచలేదు. స్వయంగా మహనీయ ఆయిషా(ర) కూడా ఆయన్ని అపవాదులను బలపరచిన వారిలో లేరనే అన్నారు.

## ప్రవక్తశ్రీ చివరి దశలో

ప్రవక్త మహనీయులు(స) అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు జరిగిన సంఘటనలు :

ఆరోగ్యం చెడిన అయిదు రోజుల తరువాత, సోమవారం నాడు ప్రవక్తశ్రీ(స) తన సతీమణుల అనుమతితో మహనీయ ఆయిషా(ర) ఇంటికి వచ్చారు. వచ్చేటప్పుడు ఆయన బల హీనత కారణంగా కాళ్ళు ఈడ్చుకుంటూ రావలసి వచ్చింది. అప్పుడు మహనీయులు అలీ(ర), అబ్బాస్ కలసి భుజాలు పట్టుకుని ఆయన్ని తీసుకువచ్చారు.

దివంగతులవడానికి నాలుగు రోజుల ముందు గురువారం నాడు ప్రవక్తశ్రీ(స) ఏడు తిత్తుల నీరు వంటి పైన వేయించుకున్నారు. మస్జిద్‌లోకి వెళ్ళాలని కోరుకున్నారు. జుహ్ర్ నమాజ్ వేళ మహనీయులు అలీ, అబ్బాస్ కలసి ఆయన్ని మస్జిద్ లోనికి తెచ్చినప్పుడు జమాఅత్ నిలిచి ఉంది. మహనీయ అబూ బక్ర్(ర) నమాజ్ చేయిస్తున్నారు. అబూబక్ర్ వెనక్కి మరలాలని అనుకున్నారు. కాని ఆయన(స) సంజ్ఞతో ఆపి ఆయనకు ప్రక్కన కూర్చొని నమాజ్ చేయించారు, ప్రవక్తశ్రీ నాయకత్వం వహించారు, అబూ బక్ర్(ర) ముకబ్బిర్ (నమాజ్ హెచ్చరికలు బిగ్గరగా పలికే వారు)గా వ్యవహరించారు.

అది ప్రవక్తశ్రీ(స) జీవితంలో చివరి దశ అని మహనీయులు అలీ, అబ్బాస్‌కు అర్థమయి పోయింది!

## అంత్యక్రియలు

దైవ సందేశ హరులు(స) పరమపదించిన తరువాత శరీరానికి స్నానం చేయించి శవ వస్త్రాలు ధరింపజేసిన వారు మహనీయులు అబ్బాస్, అలీ, ఫజ్ల్ బిన్ అబ్బాస్, ఉసామా బిన్ జైద్ (రజియల్లాహు అన్హుమ్). ఈ నలుగురే సమాధిలో అవనతం చేశారు కూడా. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని మహనీయ అలీ(ర) ఇలా ప్రకటించారు,

> "నేను ప్రవక్తశ్రీకు గుస్ల్ (స్నానం) చేయించాను, అప్పుడు ఆయన శరీరాన్ని వేరు కోణంలో పరిశీలించాను, పరమపదించిన తరువాత ఆయన పవిత్ర శరీరంలో ఏదయినా మార్పు సంభవిస్తుందా?" అని చూశాను. నాకు రవ్వంత కూడా మార్పు అగుపించ లేదు. ఆయన(స) తన జీవితంలో ఏ విధంగా పవిత్రంగా ఉన్నారో అదే విధంగా మృతి చెందిన తరువాత కూడా పవిత్రంగా పరిశుద్ధంగానే ఉన్నారు."

మహనీయ అలీ(ర)తోపాటు ఖనన క్రియలో సమాధిలో దిగి పాల్గొన్నవారిలో, మహనీయులు, ఫజ్ల్ బిన్ అబ్బాస్, కుసుమ్ బిన్ అబ్బాస్, ప్రవక్తశ్రీ బానిస షక్ రాన్(ర) కూడా ఉన్నారు.

## మహనీయ అలీ(ర) ప్రత్యేకతలు

మహనీయ అలీ (ర) తన జీవితమంతా దివ్య కుర్ఆన్ సాంగత్యంలో గడిపారు. ఎంతో ఆసక్తి, మక్కువతో కుర్ఆన్ పారాయణం చేసేవారు. అది అవతరిస్తూ ఉండగానే దాన్ని తన ఆంతర్యంలో భద్ర పరచుకునే ప్రయత్నం చేసేవారు. ఆయన అందులో లోతుగా, సుదీర్ఘంగా యోచన చేసే వారు. ఆయన దివ్యకుర్ఆన్‌ని గురించి ఎన్నో అనుభవాలు ప్రకటించారు. ఒక దానిలో, ఆయన ఇలా అంటారు,

"నేను బుద్ధిమంతుడయిన ఏ వ్యక్తినీ, అల్ బకర సూరాలోని చివరి మూడు ఆయత్‌లు పఠించకుండా నిద్రపోగా ఎరుగను." ఆయన మరో సందర్భంలో ప్రవక్త మహనీయుల(స) ప్రవచనాన్ని ఉటంకిస్తూ ఇలా అన్నారు:

ఇది మహత్తర గ్రంథం. ఇందులో గతించిన సముదాయాలను గురించి, రాబోయే జనాలను గురించిన సమాచారం ఉంది. నమ్మే వారికి ఆదేశాలున్నాయి. ఇది తీర్మానం చేసే గ్రంథం, ఇది వేళాకోళం కాదు. దాని పట్ల విముఖత చూపేవారిని దైవం సర్వ నాశనం చేసి వేస్తాడు. దాన్ని కాదని మార్గదర్శనం కొరకు ఇతరత్రా చూసే వారిని దైవం అపమార్గానికి గురి చేస్తాడు.

"దివ్య కుర్ఆన్ దైవం అందజేసిన బలమయిన త్రాడు (ఆధారం). అది వివేచన, విజ్ఞానాలు నిండిన మహత్తర జ్ఞాపిక. ఇదే రుజుమార్గం. దీన్ని పొందిన వారికి ఎన్నడూ వక్రమయిన కోరికలు కలగవు. మాటల్లో ఎప్పటికీ అస్పష్టత రాదు. కుర్ఆన్‌లోని విశేషాలు అనంతమయినవి, ఎప్పటికీ ముగియవు."

"కుర్ఆన్ పారాయణం పట్ల విజ్ఞులయిన వారి తృష్ణ ఎన్నడూ తీరదు. కుర్ఆన్ ఆధారంగా మాటలాడే వ్యక్తి సత్యం పలుకుతాడు. దాన్ని అమలు పరచిన వ్యక్తి పుణ్యఫలానికి అర్హుడవుతాడు. దాని ప్రకారం తీర్పు చేసినవాడు న్యాయబద్ధంగా తీర్పు చేస్తాడు. దాని వైపునకు పిలుపునిచ్చినవాడు సరయిన, సత్యమయిన దారిని చూపినట్లు."

ఆయన ఒకసారి, "దైవం మీద ఒట్టు! దివ్య కుర్ఆన్ ఆయత్‌లు ఏ ఆయత్ ఏ సందర్భంలో, ఎక్కడ అవతరించిందో నాకు బాగా తెలుసు. నిస్సందేహంగా నా ప్రభువు నాకు జాగరూక హృదయం, సత్యమే పలికే నోరు అనుగ్రహించాడు" అన్నారు.

మహనీయ అలీ(ర) చివరి రోజులు ఇరాక్‌లో గడిచాయి. ఆ రోజుల్లో కూఫా ఇస్లామీయ రాజ్య రాజధాని. అప్పటికి ఇంకా అనేకమంది ప్రవక్త సహచర మాన్యులు సజీవంగా ఉన్నారు. ఆ మహనీయుల సమక్షంలో ఖలీఫా ఇలా అనే వారు, "నేను మీలో నుంచి నిష్క్రమించక మునుపే నా ద్వారా దివ్య కుర్ఆన్ శిక్షణల్ని, బోధనల్ని, భావార్థాలను అడిగి తెలుసుకోండి."

ఈ నేపథ్యంలో మనం మహనీయ అలీని కేవలం ప్రవక్త సహచరులుగా, ఖలీఫాగా మాత్రమే కాక ఓ దైవజ్ఞుని రూపంలో చూడగలము.

★★★


### చందాదారులకు విజ్ఞప్తి

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి అబ్దుల్ జలీల్: 9704317015

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**


Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**



# నవాబ్ ఖాజా అతీఖుల్లాహ్

## (1876-1945)

61




ఆంగ్లేయుల కుటిల రాజకీయాలలో భాగంగా 1905లో బ్రిటిష్ వైస్రాయ్ లార్డ్ కర్జన్ బెంగాల్ విభజనకు పూనుకోగా తన యావత్తు కుటుంబీకుల అభిప్రాయాన్ని త్రోసిపుచ్చుతూ బంగ్లా విభజనను పూర్తిగా వ్యతిరేకించి నిలచిన నవాబ్ ఖాజా అతీఖుల్లాహ్ 1876 జనవరి 26న బెంగాల్‌లోని ఢాకాలో జన్మించారు. ఆయన 'ఢాకా నవాబులు'గా ప్రసిద్ది చెందిన నవాబుల కుటుంబంలోని నవాబు అహసనుల్లా మూడవ కుమారుడు. చిన్నతనంలో ఆంగ్లేయ ఉపాధ్యాయుల శిక్షణలో విద్య గరిపిన అతీఖుల్లాహ్ చిన్ననాటి నుండి లౌకిక, ఉదారవాద భావాలను ఒంటబట్టించుకున్నారు. ఆంగ్ల భాషతోపాటుగా ఉర్దూ, పర్షియన్ భాషల్లో మంచి పట్టు సంపాదించారు. 1901 డిసెంబర్ ఏడున జరిగిన ఆయన వివాహం సందర్భంగా ఢాకా నగరంలో విద్యుదీకరణకుగాను నాలుగు లక్షల రూపా యల విరాళాన్ని ప్రకటించిన తండ్రి అహసనుల్లా బాటలో ఆయన కూడా వితరణశీలిగా ఖ్యాతి గడించారు. ప్రగతిశీల, ఉదార భావాలు కలిగిన అతీఖుల్లా నవాబుల వంశ ఆచార, సాంప్రదాయాలను త్రోసిపుచ్చి ప్రజలతో కలివిడిగా గడిపారు. ప్రధానంగా విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ విద్యావ్యాప్తికి నవాబ్ అతీఖుల్లాహ్ అందించిన తోడ్పాటు ఎనలేనిది. బెంగాలులో పొటమరిస్తున్న జాతీయవాద భావ జాలం తమ మనుగడకు ప్రమాదకరంగా భావించిన లార్డ్ కర్జన్ హిందూ-ముస్లింల మధ్యన విఘాతాన్ని సృష్టించేందుకు 1905లో తెచ్చిన బెంగాల్ విభజన ఉత్తర్వులను ఆయన వ్యతిరేకించారు. విభజన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ స్వయంగా వైస్రాయ్‌కు లేఖ రాశారు. ఆయన సోదరులు నవాబ్ ఖాజా సలీ ముల్లా బెంగాల్ విభజనను సమర్థించగా, తాను మాత్రం విభజన ఉత్తర్వు లకు వ్యతిరేకంగా ఉద్యమించారు. భారత జాతీయ కాంగ్రెస్‌లోని లౌకిక-ప్రజాస్వామిక లక్షణాలను అభిమానిస్తూ కాంగ్రెస్ సభ్యత్వం స్వీకరించిన ఆయన బెంగాల్ విభజన వ్యతిరేక ఉద్యమంలో మాత్రమే కాకుండా బెంగాల్‌లో జరిగిన సభలకు సమావేశాలకు అధ్యక్షత వహించారు. 1911లో విభజన ఉత్తర్వులను ఆంగ్ల ప్రభుత్వం పూర్తిగా ఉపసంహరించుకున్న తరువాత బెంగాల్ విభజన వలన ముస్లింల ఆర్థిక-వ్యవసాయక-విద్యా వ్యవస్థలకు ఎంతో మేలు జరిగేదని ఆయన అభిప్రాయ పడటం విశేషం. చివరి క్షణం వరకు భారత జాతీయ కాంగ్రెస్ వెంట సాగిన ఆయన కాంగ్రెస్ పిలుపు మేరకు జరిగిన ఇతర ఉద్యమ కార్యక్రమాలలో కూడా చురుగ్గా పాల్గొన్నారు. ఈ దేశంలోని హిందూ-ముస్లింలు దేశానికి రెండు కళ్ళు అని ప్రకటించిన సర్ సయ్యద్ అహ్మద్ భావాలతో ఏకీభవించి, ఆ దిశగా హిందూ-ముస్లిం ఐక్యతను మరింత పటిష్టం చేయడానికి భారత జాతీయ కాంగ్రెస్‌తో కలసి చివరివరకు కృషి సాగించిన నవాబు ఖాజా అతీఖుల్లాహ్ 1945 జనవరి 21న తనువు చాలించారు. ✤



9440241727

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం



# అవినీతే పేదరికానికి మూలం

మదీహా అర్జుమంద్

**పేదరికం ఒక ఆర్థిక సమస్య.** కాని ఇది దీర్ఘకాలిక సామాజిక సమస్యగా పరిణమించింది. ఎవరైతే సమాజంలో తినడానికి తిండి, నివసించడానికి ఇల్లు, ఒంటిని కప్పుకోడానికి దుస్తులు పొందలేని పరిస్థితిని ఎదుర్కొంటారో వారిని పేదలని, ఆ స్థితిని అనుభవించడాన్ని పేదరికమని అంటారు. పేదరికం అత్యంత తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన. ప్రభుత్వాలు అమలు పరుస్తున్న వివిధ పథకాల ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు అందుతున్నట్లయితే బహుశా సమస్య కొంతవరకైనా పరిష్కారమై ఉండేది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలైనా, ఇంకా మనం పేదరికం గురించి మాట్లాడుకునే స్థితిలోనే ఉన్నామంటే పాలకుల నిర్లక్ష్యమే కారణం. నిజానికి ఈ ఏడున్నర దశాబ్దుల కాలంలో దేశం అనేక రంగాల్లో అభివృద్ధిని సాధించింది. ముఖ్యంగా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మన దేశ ప్రగతి అంబరాన్ని తాకుతోంది. ఇది చాలా సంతోషమే అయినప్పటికీ, వాస్తవాభివృద్ధికి ఇదొక్కటే కొలబద్ధకాదు. ఆకలి తీర్చలేకపోతున్న టెక్నాలజీకి అర్ధమే లేదు. జానెడు పొట్ట నింపుకునేందుకు మనిషి పడరాని పాట్లు పడుతున్నాడు. అంతరిక్షంలోకి దూసుకుపోతున్న ఈ రోజుల్లో కూడా ఆకలి కేకలు వినిపించడంకంటే విషాదం ఏముంటుంది? ప్రపంచ వ్యాప్తంగా 45 దేశాల్లోని 34.5 కోట్ల మంది ప్రజలు తీవ్రమైన ఆకలితో మరణించారని, సగటున ప్రతి సెకనుకు నలుగురు చొప్పున మృత్యువాత పడుతున్నారని నివేదికలు చెబుతున్నాయి. కరోనాకు ముందు నమోదైన ఆకలి చావులతో పోలిస్తే.. ఇప్పుడు రెట్టింపు అయినట్లుగా ఈ నివేదికలు వెల్లడిస్తున్నాయి. 75 దేశాలకు చెందిన ఆక్స్‌ఫామ్.. సేవ్ ది చిల్డ్రన్.. ప్లాన్ ఇంటర్నేషనల్ వంటి 238 స్వచ్ఛంద సంస్థలు కలిసి తాజాగా ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ సమావేశాలకు హాజరయ్యే ప్రపంచ నేతలకు ఒక లేఖ రాశాయి. అందులో ఆకలి కారణంగా చనిపోతున్న వారికి సంబంధించిన

సంచలన విషయాలు వారి దృష్టికి తీసుకువెళ్ళాయి. మరో అంచనా ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఆకలి కారణంగా రోజుకు 19700 మంది మరణిస్తున్నారని తేల్చారు. 2019తో పోలిస్తే తాజాగా ఆకలి చావులు రెట్టింపు అయినట్లుగా పేర్కొన్నారు. 45 దేశాల్లోని మరో ఐదు కోట్ల మంది ప్రజలు కరువుకు చేరువలో ఉన్నట్లు కూడా ప్రకటన పేర్కొంది. 21వ శతాబ్దంలో కరువు పరిస్థితులను రానివ్వమని ప్రపంచ దేశాల నేతలు ప్రతిన పూనినప్పటికీ పరిస్థితిలో మార్పులేదు. దేశంలో అనేకచోట్ల నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులే దీనికి నిదర్శనం. ఆకలి చావులు అన్నవి కేవలం ఒక దేశానికో.. ఒక ఖండానికో కాదు.. మొత్తం మానవాళికే జరుగుతున్న అన్యాయంగా భావించాలి. ఏదో సాధించేశామని ప్రభుత్వాలు డబ్బా కొట్టుకోవడమేగాని వాస్తవంలో అంతా శూన్యమే. ఏ దేశ స్వాతంత్ర్య, అభివృద్ధి ఫలాలైనా ప్రాథమికంగా అన్ని వర్గాల ప్రజలకు సమానంగా, నిష్పక్షపాతంగా, న్యాయంగా అందినప్పుడే అభివృద్ధికి ఒక అర్థమనేది ఉంటుంది. ఈ నేపథ్యంలో ఏడున్నర దశాబ్దుల మన స్వతంత్ర దేశాన్ని చూసినప్పుడు నిరాశే మిగులుతుంది. భిన్నవర్గ, సముదాయాల మన దేశంలో అందరికీ సమాన ఫలాలు అందుతున్నాయా అన్నది కోటి డాలర్ల ప్రశ్న. నిజంగానే ప్రజలకు మౌలిక సదుపాయాలు లభిస్తున్నట్లయితే ఈనాడు మనం ఇలా చర్చించుకోవాల్సిన పరిస్థితి ఉండేదికాదు. స్వాతంత్ర్యానంతర కాలం నుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పల్లె సీమల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని, తాగునీరు, సాగునీరు, రోడ్లు, డ్రైనేజీలాంటి మౌలిక సదుపాయాలతో పాటు, ఉపాధి కల్పనకు ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెబుతున్నాయి. అయినా ప్రజల జీవన స్థితిగతుల్లో పెను మార్పులు చోటు చేసుకోలేదు. ఆధునిక సాంకేతిక విప్లవం పల్లె సీమల అభివృద్ధికి ఎంతో కొంత దోహద పడుతున్నప్పటికీ తగినంతగా ఫలితాలను అందించలేక పోతోంది. పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు అనేక పథకాలు, ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి పేర కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న ప్పటికీ వ్యవస్థలో వేళ్ళూనుకుపోయిన అవినీతి కారణంగా ఆశించిన ఫలితం కనబడడంలేదు. ఇప్పటికీ కనీస, మౌలిక సదుపాయాలు లేని పల్లెలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి.

ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో 2030 నాటికల్లా పేదరికాన్ని నిర్మూలించాలన్న అంశం ఒకటి. కానీ, ఆ గడువు పూర్తయ్యే నాటికి కూడా ప్రపంచ జనాభాలో ఆరు శాతం మంది అంతర్జాతీయ దారిద్ర్య రేఖకు దిగువనే ఉంటారని స్వయంగా ఐక్యరాజ్య సమితి నివేదికే వెల్లడించింది. ఈ దరిద్రాన్ని నిర్మూలించాలంటే విభిన్న వ్యూహాలతో ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరముంది. అభివృద్ధిని పరుగులు పెట్టించటంతో పాటు దాన్ని అన్ని ప్రాంతాలకూ సమానంగా విస్తరించటం పైనా దృష్టిసారించాలి. దీనికోసం మొట్టమొదట చేయవలసింది అవినీతి నిర్మూలన. అవినీతి నిర్మూలించబడనంత కాలం పేదరిక నిర్మూలన సాధ్యం కాదు. కేవలం అభివృద్ధి జపంతో పేదరికాన్ని అంతం చేయగలమనుకోవటం అతిశయోక్తి తప్ప మరేంకాదు. భారత్ వంటి దేశాల్లో వ్యవసాయానికి తగిన ప్రాధాన్యమివ్వటం తప్పనిసరి. మహిళలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో సాధికారత కల్పించటం ముఖ్యం. శ్రమ సాంద్ర ఉత్పాదక రంగాన్ని ప్రోత్సహించడం దారిద్ర్య నిర్మూలన దిశగా గొప్ప ముందడుగవుతుంది. నైపుణ్యాల కల్పన, యువతకు విరివిగా ఉపాధి అవకాశాలు కల్పించటంపై ప్రభుత్వాలు దృష్టిసారించాలి. అందరికీ సమాన అవకాశాలు అందుబాటులో ఉండే వాతావరణం సృష్టించాలి. కనీసం అందరికీ సమానంగా విద్య, వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉండే పరిస్థితులు మెరుగు పరచాలి. అన్నిటికీ మించి సంపదను కొంత మంది గుప్పెట నుండి బయట పడేసే విప్లవాత్మక కార్యాచరణ రూపొందించాలి. సంపద వికేంద్రీకరణ జరగకపోతే, అది 'కొంతమంది' గుప్పెట్లోనే బందీగా ఉంటే ధనవంతులు మరింత ధనవంతులుగా, పేదలు మరింత పేదలుగా రూపాంతరం చెందుతారే తప్ప పేదరిక నిర్మూలన జరగదు. మానవ మస్తిష్కాల్లో పరివర్తనా బీజం నాటుకోనంతకాలం మనం ఎన్ని పేదరిక నిర్మూలనా సూక్తులు వల్లించినా ఫలితం దక్కదు. దానికోసం నిర్ణీత సంపద కలిగిన ప్రతి ఒక్కరూ, తమ సంపద లోని కొంతభాగాన్ని స్వచ్ఛందంగా వదులుకోవలసి ఉంటుంది. దీన్నే ఇస్లామీయ పరిభాషలో 'జకాత్' అంటారు. అప్పుడు మాత్రమే పేదరికం అంతమై మానవ సమాజం సుభిక్షంగా వర్ధిల్లుతుంది. ఆ శుభదినం కోసం మనమంతా ఎదురుచూద్దాం. ✤

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




# గులాబీ నోటుకు కాలం చెల్లింది

**అమ్రా ఇజాన్**

**ఈ నెల** ప్రారంభంలో రిజర్వు బ్యాంకు ప్రకటన ప్రకారం 97.96 శాతం 2000 రూపాయల నోట్లు వెనక్కు వచ్చేశాయి. ఇంకా 7,261 కోట్ల రూపాయలు చెలామణిలో ఉన్నాయని తెలిపింది. మే 19, 2023న ఆర్‌బిఐ 2000 రూపాయల నోటును ఉపసంహరించింది. అప్పుడు 3.56 ట్రిలియన్ రూపాయల విలువ గల 2000 రూపాయల నోట్లు చెలామణిలో ఉన్నాయి. అందులో 97.96 శాతం 2000 రూపాయల నోట్లు వెనక్కు వచ్చేశాయి.

నోట్లరద్దు జరిగినప్పుడు, నోట్ల కోసం జనం అలమటిస్తున్నప్పుడు, తాము దాచుకున్న తమ డబ్బులే బ్యాంకుల నుంచి తీసుకోలేక క్యూలు కడుతున్నప్పుడు నేనున్నా అంటూ సగటు మనిషి చేతిలో రెపరెపలాడుతూ వచ్చి వాలింది గులాబీ నోటే. ఆ వెంటనే ఫేక్ వార్తల సైన్యాలు గులాబీనోటులో చిప్పుందని జనం చెవిలో పువ్వులు పెట్టిన వార్తలు కూడా చాలా మందికి గుర్తుండే ఉంటాయి. గులాబీ నోట్లను ఎవ్వరు బ్లాక్ మనీగా మార్చలేరని, ఇందులో చిప్పుందని, ఎవరైనా పెద్ద సంఖ్యలో గులాబీ నోట్లు దాచుకుంటే తక్షణం ఆ విషయం మన ప్రభుత్వానికి తెలిసి పోతుందని క్షణాల్లో బ్లాక్ మనీ పెద్దల్ని నిర్బంధించేస్తారని మన జాతీయ టీవీ చానళ్ళు ఊదరగొట్టిన విషయం కూడా చాలా మందికి గుర్తుండే ఉంటుంది. ఆ తర్వాత ఈ చిప్పు కథ చెప్పుకుని నవ్వుకున్న వారిలో చాలా మంది ఇప్పుడు కూడా నవ్వుకోవచ్చు.

ఏది ఏమైనా ఇలా మన జ్ఞాపకాల్లో మరువలేని జ్ఞాపకంగా మారిన 2000 నోటు ఇక కనిపించదు. నోట్లరద్దు హఠాత్తుగా వచ్చిపడింది. అప్పుడు సగటు మనిషికి టైమే దొరకలేదు. తన వద్ద ఉన్న నోట్లను వెంటనే జమ చేయించుకోవలసి వచ్చింది.

రెండువేల నోటు అనేది గతంలో ఎన్నడూ చెలామణిలో లేదు. నోట్లరద్దు తర్వాత మాత్రమే చెలామణిలోకి వచ్చింది. హడావిడిగా నోట్ల రద్దు చేయడం వల్ల మార్కెటులో నగదు తక్షణం పంపిణీ చేయడానికి 2000 నోటును విడుదల చేశారు. ఆ తర్వాత ప్రజలకు 2000 నోటు చిల్లర దొరకడం చాలా కష్టమైన పనిగా మారింది. రిజర్వు బ్యాంకు 2018-19 నుంచి 2000 రూపాయల నోటును ముద్రించడం మానేసింది. ఒక నోటు

ముద్రించిన తర్వాత దాని జీవితకాలం ఐదేళ్ళు మాత్రమే. 2000 నోటు జీవితకాలాన్ని పూర్తి చేసుకుంది.

ఇప్పుడు 2000 నోటును ఉపసంహరించడం వల్ల ఆర్థికవ్యవస్థపై ఎలాంటి ప్రభావం ఉండదని, ఎందుకంటే 500 ఇతర డినామినేషన్ల నోట్లు చాలా అందుబాటులో ఉన్నాయని రిజర్వు బ్యాంకు తెలియజేసింది. అది కాక రోజువారి లావాదేవీల్లో ఇప్పుడు 2000 రుపాయల నోటు వాడకం బాగా తగ్గిపోయింది. ప్రస్తుతం చెలామణిలో ఉన్న నగదులో 2000 నోట్లు కేవలం 10 నుంచి 11 శాతం మాత్రమే ఉంటాయి. నోట్లరద్దు తర్వాత హడావిడిగా 2000 నోటును ముద్రించి ఆర్థికవ్యవస్థలో ప్రవేశ పెట్టిన రిజర్వుబ్యాంకు ఇప్పుడు క్లీన్ నోట్ల పాలసీ అమలు చేస్తున్నామని అందుకే 2000 నోటును విడుదల చేశామని అంటున్నారు.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశంలోని అన్ని బ్యాంకుల మీద కొత్త నియమాలను కొంత కాలం క్రితం అమలులోకి తీసుకు వచ్చింది. బ్యాంకులు కస్టమర్ల నుండి 2000 రూపాయల నోట్లు స్వీకరించగలుగుతాయి గానీ, మళ్లీ కస్టమర్లకు డబ్బులు ఇవ్వాల్సి వచ్చినప్పుడు ఎట్టి పరిస్థితుల్లో 2,000 రూపాయల నోట్లని ఇవ్వకూడదని అప్పట్లోనే చెప్పింది. డిసెంబర్ 2019 నుండి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2000 నోట్లను ముద్రించడం నిలిపివేసింది. ATM మెషిన్లలో కూడా రూ. 2,000 రూపాయల నోట్లు లోడ్ చెయ్యొద్దని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులను ఆదేశించింది. మనీలాండరింగ్ లాంటి కార్యకలాపాలకు పెద్ద నోట్లను వాడుతున్నట్లు మోదీ ప్రభుత్వం భావించడం వలన దశల వారీగా 2,000 నోట్లని ఉపసంహరించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు చాలా కాలం క్రితమే తెలిసింది. 2000 రూపాయల నోట్లని రద్దు చెయ్యడానికి సన్నాహాలు జరుగుతున్నాయన్న వార్తలు కూడా వచ్చాయి. దేశంలో నోట్ల రద్దు తర్వాత 2వేల రూపాయల నోట్లు అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ నోట్లు ఇప్పుడు కనిపించడం లేదు. ఎక్కడ చూసినా రూ.500 నోట్లు, రూ.100 నోట్లే కనిపిస్తు న్నాయి. రెండు వేల రూపాయల నోట్ల ముద్రణ నిలిపివేసినట్లు కొంతకాలం క్రితం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలియ జేసింది. 2019 నుంచి ఇప్పటి వరకు రెండు వేల రూపాయల నోట్లు ముద్రించలేదని రిజర్వ్ బ్యాంక్ నోట్ ముద్రణ ప్రైవేట్ లిమిటెడ్ ఒక ఆర్బీఐ ప్రశ్నకు గత సంవత్సరం సమాధానం చెప్పింది. 2016 నుంచి ఆర్బీఐ ఈ నోట్ల ముద్రణను తగ్గిస్తూ వస్తోందని కేంద్ర బ్యాంకు తాజాగా విడుదల చేసిన వార్షిక నివేదికలో పేర్కొంది. బ్యాంకులు కూడా చిన్న డినామినేషన్ల నోట్లనే ఎక్కువగా అడుగుతున్నాయని, సామాన్యులు పెద్ద నోట్లను కోరుకోవడం లేదని తెలుస్తోంది. మరో వైపు నకిలీ రెండువేల నోట్లు మార్కెట్లో భారీగానే వస్తున్నాయి. అధికారులు దాడులు చేసి ఇప్పటికే చాలా నోట్లను స్వాధీనం చేసుకున్నారు. 2 వేల రూపాయల నకిలీ నోట్ల ముద్రణ దాదాపు 55 శాతానికి పైగా పెరిగినట్లు కేంద్ర బ్యాంకు గుర్తించింది.

మోదీ ప్రభుత్వం నోట్ల రద్దుకు కారణాలుగా చెప్పిన వాటిలో నల్లధనాన్ని అరికట్టడం అనేది అన్నింటికన్నా ముఖ్యమైంది. నల్లధనాన్ని నిర్మూలించడం, దొంగనోట్లను అంతం చేయడం, అవినీతి భరతం పట్టడం ఇలాంటి చాలా లక్ష్యాలు నోట్లరద్దుకు చెప్పారు. ఈ లక్ష్యాల్లో ఒక్కటి కూడా సాధించలేకపోయామని చాలా మంది విశ్లేషించారు. నల్లధనం విషయానికి వస్తే కానీ, ముఖ్యంగా గత ఏడాది కాలంగా దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థల దాడులు, వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, ఉపఎన్నికల సమయంలో అధికారులకు సోదాల్లో దొరికిన నగదులో ఎక్కువగా రెండు వేల నోట్ల కట్టలే ఉన్నాయి. తెలంగాణలో జరిగిన హుజూరాబాద్ ఉప ఎన్నిక, మునుగోడు ఉప ఎన్నికలో లెక్కా పత్రం లేని డబ్బు ప్రవాహాన్ని చూసిన తరువాత నోట్లరద్దుతో నల్లడబ్బు నాశనమైపోయిందని నమ్మగలమా? పశ్చిమ బెంగాల్ మంత్రి పార్థా చటర్జీ, అతని సన్నిహితురాలు అపర్ణా ముఖర్జీ ఇళ్లలో అధికారికంగా ప్రకటించిన రూ.49.80 కోట్ల నగదు కట్టలు, ఐదు కోట్ల విలువైన బంగారం వారి వద్దకు ఎలా చేరినట్లు? చిత్తశుద్ధితో దాడులు చేస్తే దేశంలో అలాంటివి ఇంకా ఎన్నో దొరకవచ్చు. నగదును పెద్ద మొత్తంలో దాచేందుకు రెండు వేల రూపాయల నోటు అనువుగా మారిందన్నది స్పష్టం. అలాగే నల్లధనాన్ని నిల్వ చేస్తున్న వారు దాన్ని రెండువేల నోట్ల రూపంలో దాచే అవకాశం ఎక్కువగా ఉందని బ్యాంకింగ్ రంగ నిపుణుల అభిప్రాయం.

ఇప్పుడు కూడా బీజేపీ నేతలు నోట్లరద్దు మాదిరిగానే 2000 నోట్ల ఉపసంహరణ కూడా నల్లధనంపై మాస్టర్ స్ట్రోక్ అన్నారు. బీహారుకు చెందిన బీజేపీ నాయకుడు సుశీల్ మోదీ మాట్లాడుతూ నల్లధనంపై ఇది రెండవ సర్జికల్ స్ట్రయిక్ అని చెప్పుకున్నారు. నోట్లరద్దు తర్వాత ప్రభుత్వం ప్రజలకు వెంటనే ఊరట ఇవ్వడానికి 2000 నోటు తీసుకువచ్చిందని, దీనివల్ల సాధారణ

ప్రజలకు ఊరట దొరికిందని అన్నాడు. రెండువేల రూపాయల నోట్లను దశలవారీగా వెనక్కు తీసుకోవా లని సుశీల్ కుమార్ మోడీ రాజ్యసభలో గత సంవత్సరం డిసెంబరులో డిమాండ్ చేశారన్నది కూడా గుర్తుంచుకోవాలి. దేశంలో అన్ని ఏటిఎంలలో రెండు వేల రూపాయల నోటు కనుమరుగైపోయిందని, త్వరలో ఈ నోట్లనూ రద్దు చేస్తారన్న ప్రచారం జరుగుతోందని దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కూడా ఆయన అడిగారు. నల్లధనాన్ని నిర్మూలించడానికి ఇలాంటి మాస్టర్ స్ట్రోక్‌లు ఇంకా ఎన్ని అవసరమని సగటు మనిషి ఆశ్చర్యపోతున్నాడు.

నోట్ల రద్దు జరిగిన 2016 నాటికి దేశవ్యాప్తంగా మొత్తం కరెన్సీలో వెయ్యి, ఐదువందల రూపాయల నోట్ల వాటా 80 శాతం వరకు ఉండేది. చాలా మంది డిమానిటైజేషన్ చాలా గొప్ప నిర్ణయమని నమ్మారు. అవినీతిని అంతం చేయడానికి నల్లడబ్బును నిర్మూలించడానికి ఇంతకన్నా గొప్ప నిర్ణయం ఉండదనుకున్నారు. డిమానిటైజేషన్ దెబ్బకు నల్లడబ్బు బయటకు వచ్చి తీరాల్సిందే అనుకున్నారంతా. జన్ ధన్ ఖాతాల్లో డిపాజిట్ అయ్యే డబ్బుపై విచారణ జరుగుతుందన్నారు. జన్ ధన్ ఎన్ని ఖాతాల్లో ఎంత సొమ్ముంది? ఈ విషయమై విచారణ జరుగు తుందా అన్నది కూడా స్పష్టంగా తెలియదు. రిజర్వు బ్యాంకు వార్షిక రిపోర్టులో కూడా దీనికి సంబంధించిన సమాచారమేదీ లేదు. జన్ ధన్ ఖాతాల్లో ఎంత సొమ్ము పట్టుకున్నారన్నది చెప్పలేదు. 2016 నవంబర్ 8వ తేదీకి ముందు దేశంలో 500 నోట్లు, 1000 నోట్లు మొత్తం 15 లక్షల 41 వేల నోట్లు చెలామణిలో ఉండేవి. ఇప్పుడు తిరిగి వచ్చిన నోట్లు ఎన్నంటే, 15 లక్షల 32 వేల నోట్లు తిరిగి వచ్చేశాయి. అంటే రద్దయిన నోట్లలో 99.3 శాతం నోట్లు తిరిగొచ్చేశాయి. నోట్లు రద్దు చేస్తే కొత్త నోట్లు ముద్రించాలి కదా. కొత్త నోట్లు ముద్రించడానికి 7,965 కోట్ల రూపాయలు ఖర్చయ్యాయి. ఇంత చేస్తే బ్యాంకులకు తిరగిరాని నోట్ల విలువ కేవలం 10 వేల కోట్ల రూపాయలు. మరి నల్లడబ్బేమై పోయింది. బ్యాంకులకు రాకుండా కనీసం మూడు నాలుగు లక్షల కోట్ల రూపాయల నల్లధనం ఉండిపోతుందని, అదంతా ప్రభుత్వఖాతాలోకి వస్తుందని, ప్రజాసంక్షేమకార్యక్రమాలకు ఉపయోగిస్తారని అనుకున్నారంతా? నల్లడబ్బును పట్టుకునే విషయంలో దారుణంగా విఫలమైంది నోట్లరద్దు. ఇక నకిలీ కరెన్సీ, దొంగనోట్ల ఆటకట్టించాడానికి తిరుగులేని ఉపాయం నోట్లరద్దు అన్నారు. నిజమే అనుకున్నారు అప్పట్లో చాలా మంది. ఇప్పుడు 2000 రూపాయల దొంగనోట్లు పెరిగాయి. 500 రూపాయల దొంగనోట్లు కూడా చాలా పెరిగాయని తెలుస్తోంది. దొంగనోట్ల వ్యవహారంలోను నోట్లరద్దు పూర్తిగా విఫలమయ్యింది.

నోట్ల రద్దు తర్వాత పేద, మధ్యతరగతి ప్రజలే కష్టాల పాలయ్యారు. సంపన్నులెవరు కష్టపడిన వార్తలు రాలేదు. జనాభా లెక్కల ప్రకారం చూస్తే దేశంలోని దళిత కుటుంబాల్లో కేవలం 7.3శాతం మాత్రమే ఉద్యోగాల్లో ఉన్నారు. అందులో కేవలం 3.96 శాతం మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నారు. 2.42 శాతం ప్రయివేటు ఉద్యోగాల్లో ఉన్నారు. ఆదివాసి జనాభా విషయానికి వస్తే కేవలం 4.38 శాతం మాత్రమే ప్రభుత్వ ఉ ద్యోగాల్లో ఉన్నారు. 1.48 ప్రయివేటు ఉద్యోగాల్లో ఉన్నారు. మిగిలిన జనాభా, అంటే దళితుల్లో 92.7 శాతం, ఆదివాసుల్లో దాదాపు 94 శాతం జనాభా వ్యవసాయకూలీలుగా, కాజువల్ లేబరుగా, పారిశుధ్యకార్మికులుగా, హెల్పర్లుగా చిన్న చిన్న పనులు చేసుకుంటూ తమ జీవనోపాధి పొందుతున్నారు. నోట్ల రద్దు వల్ల వ్యవసాయ కూలీలుగా ఈ దళిత, ఆదివాసి ప్రజలకు తినడానికి తిండి కూడా దొరకని పరిస్థితి ఎదురైంది.

నోట్లరద్దు మొదటిసారి 1946లో అంటే బ్రిటీషు కాలంలో జరిగింది. 1946 జనవరిలో 1000, 5000, 10,000 రూపాయల నోట్లను రద్దు చేశారు. అంటే స్వాతంత్ర్యానికి ఏడాదిన్నర ముందు బ్రిటీషు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అప్పట్లో 10,000 రూపాయల నోట్లు కూడా ఉండేవి. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రింటు చేసిన అతి పెద్ద నోటు కూడా ఇదే. 1938లో మొదటిసారి ప్రవేశపెట్టారు. 1946లో రద్దయిన ఈ నోట్లను మళ్ళీ 1954లో ప్రవేశపెట్టారు. డెబ్భైలలో టాక్సుల విచారణ కోసం భారత ప్రభుత్వం వాంఛూ కమిటీని నియ మించింది. నల్లధనం కనిపెట్టడానికి, దాన్ని తొలగించడానికి పెద్ద నోట్లను రద్దు చేయాలని ఆ కమిటీ సూచించింది. 1977లో జనతా పార్టీ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రధానిగా మురార్జీ దేశాయ్ నల్లధనంపై, దొంగనోట్లపై కొరడా ఎత్తారు. 1978 జనవరి 16న మళ్ళీ 1000, 5000, 10,000 నోట్లను రద్దు చేశారు. కాని అప్పట్లో రిజర్వు బ్యాంకు గవర్నరుగా ఉన్న ఐ.జి.పాటిల్ ఈ చర్యను సమర్ధించలేదు. నల్లధనాన్ని పట్టుకునే వివిధ పద్ధతులుంటే నోట్ల రద్దు లాంటి చర్య చేపట్టడమేమిటని విమర్శించడానికి వెనుకాడలేదు. మోడీ తీసుకున్న నిర్ణయం పూర్తిగా అప్పట్లో మురార్జీ దేశాయ్ తీసుకున్న నిర్ణయానికి కాపీ వంటిదే. ఇప్పుడు రిజర్వు బ్యాంకు గవర్నర్ ఉర్జిత్ పటేల్ నోట్ల రద్దును సమర్ధించారు. అప్పట్లోను ఈ

చర్య వల్ల నల్లధనం తగ్గలేదు. ఇప్పుడు కూడా దీనివల్ల గొప్ప ఫలితాలు వస్తాయని చాలా మంది ఆర్థికవేత్తలు భావించ లేదు.

హడావిడిగా అమలు చేసిన నోట్లరద్దు తర్వాత మార్కెట్లోకి కరెన్సీని వెంటనే సరఫరా చేయడానికి పెద్ద డినామినేషన్ 2000 ప్రవేశపెట్టారు. దీనివల్ల రద్దయిన నోట్లకు బదులుగా కొత్త నోట్లను ఇవ్వడం తేలికవుతుందని భావించారు. అంతకు మించి 2000 నోటును ప్రవేశపెట్టడంలో వ్యూహాత్మక ఆలోచనలేమీ కనబడడం లేదు. తర్వాత నెమ్మదిగా మార్కెట్లో 500 నోట్లను పెంచుతూ 2000 నోట్లను తగ్గిస్తూ వచ్చారు. 2016 నుంచే ఒక వ్యూహం ప్రకారం ఆర్బీఐ పింక్ నోట్ల ప్రింటింగ్‌ను తగ్గిస్తూ వస్తోందని కేంద్ర బ్యాంక్ విడుదల చేసిన వార్షిక నివేదిక స్పష్టం చేస్తోంది.

పెద్దనోట్లు నల్లధనం నిల్వ చేసుకోడానికి ఉపయోగపడతా యన్నది వాస్తవం. కాని అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ నిర్ణయం ఎందుకు తీసుకోలేదు. కర్నాటక ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎందుకు ఆగారనే ప్రశ్న అలాగే ఉంది. కాని ఈ నిర్ణయం వల్ల బ్యాంకులకు చాలా లాభం ఉంది. 2000 నోట్లు ఉన్న వారంతా ఇప్పుడు బ్యాంకులకు పరుగెత్తుతారు. బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తారు. దీనివల్ల బ్యాంకుల్లో నగదు పెరుగుతుంది.

క్యాష్ లెస్ ఎకానమి విషయానికి వస్తే నోట్లరద్దు జరిగిన తర్వాత క్యాష్ లెస్ లావాదేవీలు పెరిగాయి. ఎందుకంటే నగదు అందుబాటులో లేనందువల్ల. కాని నగదు మార్కెటులోకి వచ్చిన తర్వాత మళ్ళీ యథాప్రకారమే. పన్నుల ఎగవేత ఉండదని అన్నారు. టాక్స్ కలెక్షన్ పెరుగుతుందని అన్నారు. 14 శాతం టాక్స్ కలెక్షన్ పెరిగిందని చెప్పారు. 2013లో కూడా నోట్లరద్దు లేకపోయినా ఇంతే టాక్స్ కలెక్షన్ పెరిగింది. నోట్లరద్దు జరిగిన కొద్ది నెలలకే 2017 జులైలో జిఎస్‌టి విధానాన్ని తీసుకు వచ్చారు. ఆ తరువాత కార్పొరేట్ పన్ను మొత్తాన్ని గణనీయంగా తగ్గించారు. పెద్ద నోట్ల రద్దుకు ముందు 2011-12 నుంచి 2016-17 వరకు జిడిపి వృద్ధి రేటు 5.2 నుంచి 8.3 శాతానికి పెరిగింది. నోట్ల రద్దు తర్వాత కరోనాకు ముందు 2019-20 నాటికి నాలుగు శాతానికి దిగజారింది. మరుసటి ఏడాది కరోనాతో 7.3 శాతం తిరోగమనంలో పడింది. తరువాత వృద్ధి రేటు ఇంకా కరోనా పూర్వపు స్థితికి చేరుకోలేదు. పన్ను ఎగవేతలు, ఆర్థిక నేరాలకు తావు లేకపోతే గత ఎనిమిదిన్నర సంవత్సరాల్లో విపరీతంగా పెరిగిన ఐటి దాడులు ఎందుకు జరుగుతున్నాయి?

ఇప్పుడు గులాబీ నోటు మాయమవుతోంది. దీనివల్ల నల్లధనం తగ్గుతుందా? దొంగనోట్లు తగ్గుతాయా? అవినీతి తగ్గుతుందా? ఆలోచించాలి. ✤


సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

59 ఆయత్‌లు

# 44. అద్ దుఖాన్

1 – 4 హా, మీమ్. ఈ ప్రకాశమానమయిన గ్రంథం మీద ఒట్టు. మేము దీనిని ఒక మహా శుభప్రదమయిన రాత్రిన అవతరింపజేశాము, మేము జనుల్ని హెచ్చరించాలని సంకల్పించుకున్నాము గనక.[1] ఆ రాత్రిన ప్రతి వ్యవహారానికి వివేకవంతమయిన తీర్పు[2] మా ఆదేశంతో విధించడం జరుగుతుంది.[3]

1. 'కితాబుమ్ముబీన్' మీద ప్రమాణం చెయ్యడం అంటే భావం ఏమిటో జుఖ్రుఫ్ సూరా, పాద సూచిక నెం.1లో తెలుపడం జరిగింది. ఇక్కడ కూడా ప్రమాణం చేస్తున్న విషయం, ఈ గ్రంథ రచయిత ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) కాదు, "మేము" అన్నది. దానికి నిదర్శనం మరెక్కడో వెదకనవసరం లేదు, స్వయంగా ఈ గ్రంథమే దీని నిరూపణకు చాలు. దీని తరువాత అదనంగా తెలిపిన విషయం ఏమిటంటే, దీన్ని అవతరింపజేసిన రాత్రి ఎన్నో శుభాలు నిండిన రాత్రి. అంటే, ఈ బుద్ధిహీనులకు తమ మంచీ చెబ్బరలేమిటో వారికే స్పృహ లేదు. ఈ గ్రంథం రావడం తమకు ఆకస్మిక విపత్తుగా భావిస్తున్నారు. దీన్నుండి ఎలాగయినా తప్పించుకోవాలన్న ఆలోచనతో పడరాని తిప్పలు పడుతున్నారు. కాని వాస్తవానికి వీరి కొరకు, మానవాళి అంతటి కొరకు ఆ క్షణం అత్యంత శుభప్రదమయిన క్షణం. అప్పుడు, ఏమరుపాటులో పడి ఉన్న జనుల్ని హెచ్చరించడానికి 'మేము' ఈ గ్రంథం అవతరింపజేయాలని నిర్ణయించాము.

ఆ రేయి ఖుర్‌ఆన్ అవతరింపజేయడం అంటే భావం, కొందరు వ్యాఖ్యాతలు, ఆ రాత్రే ఖుర్‌ఆన్ అవతరణ ప్రారంభమయిందని గ్రహించారు. మరి కొందరు దాని భావం, అందులోనే పూర్తి ఖుర్‌ఆన్ "ఉమ్ముల్ కితాబ్" (మూలగ్రంథం) నుండి బదలీ అయి వహీని మోసే దైవదూతలకు అప్పగించబడిందని, ఆ తరువాత పరిస్థితులు, సంఘటనల రీత్యా అవసరంకొద్దీ ప్రవక్త మహనీయుల (స)కు 23 ఏళ్ళ వరకు అవతరింపజేయబడుతూ ఉండిందని గ్రహించారు. నిజ పరిస్థితి ఏమిటో అల్లాహ్‌కే బాగా తెలుసు.

ఆ రాత్రి అంటే, అల్ కద్ర్ సూరాలో 'లైలతుల్ కద్ర్' అని పేర్కొన్న రాత్రి అన్నమాట. అక్కడ "మేము దీనిని ఘనత గల రాత్రిన అవతరింపజేశాము" అని చెప్పబడింది. ఇక్కడేమో "మేము దీనిని ఒక శుభప్రదమయిన రాత్రిన అవతరింపజేశాము" అని చెప్పడం జరిగింది. ఆ రాత్రి రమజాన్ నెలలోని ఒక రేయి అన్న విషయం కూడా దివ్య ఖుర్‌ఆన్‌లోనే చెప్పడం జరిగింది.

"రమజాన్ నెల–ఈ నెలలోనే ఖుర్‌ఆన్ అవతరించింది." (2:185).

2. మూలంలో **అమ్రిన్ హకీమ్** అనే పదం ప్రయోగించబడింది. దీనికి రెండు అర్థాలు. ఒకటి ఆ ఆదేశం పూర్తిగా వివేచన ప్రధానమయింది అన్నది, అందులో ఎటువంటి తప్పు, కొరత ఉండే అవకాశం లేదు. రెండు, అదొక పరిపక్వమయిన సుస్థిర మయిన నిర్ణయం అన్నది. దాన్ని మార్చివేయడం ఎవరి తరమూ కాదు.

3. 'అల్ కద్ర్' సూరాలో ఇదే విషయాన్ని ఇలా తెలుపడం జరిగింది. "(దైవ దూతలు, ఆత్మ ఇందులో తమ ప్రభు అనుజ్ఞతో ప్రతి ఆదేశాన్ని తీసుకుని దిగివస్తారు). దీన్నిబట్టి తెలిసేదేమిటంటే, పరమ ప్రభువు అల్లాహ్ రాజ్య వ్యవస్థ పరిపాలనలో అదొక ప్రత్యేకమయిన రేయి. అందులో ఆయన వ్యక్తులు, జాతులు, దేశాల భాగ్యాల నిర్ణయాలు చేసి తన దూతలకు అప్పజెబుతాడు. తరువాత వారు ఆ నిర్ణయాల ప్రకారం అమలు జరుపుతూ ఉంటారు. కొందరు వ్యాఖ్యాతలకు, వీరిలో హజ్రత్ ఇక్రిమ అందరిలోకెల్లా ప్రముఖంగా ఉన్నారు, అది షాబాన్ నెల (15వ తేది) మధ్య రాత్రి అన్న అనుమానం కలిగింది. కొన్ని హదీసుల్లో ఈ రాత్రి గురించే, అందులో భాగ్యాల నిర్ణయాలు జరుగుతాయన్న విషయం ఉటంకించబడిన కారణాన ఆయన అలా అనుకున్నారు. కాని ఇబ్ను అబ్బాస్, ఇబ్ను ఉమర్, ముజాహిద్, కతాద హసన్ బస్రీ, సయీద్ బిన్ జుబైర్, ఇబ్ను జైద్, అబూ మాలిక్, జహ్హాక్ తదితర అనేక వ్యాఖ్యాతలు ఇది రమజాన్‌లో లైలతుల్ కద్ర్ అని చెప్పుకునే రాత్రే అని ఏక గ్రీవంగా అంగీకరించారు. ఎందుకంటే దివ్యఖుర్‌ఆన్ స్వయం గానే దాన్ని స్పష్టపరుస్తోంది. ఖుర్‌ఆన్ స్పష్టీకరణ ఉన్నచోట అక్కడ (అఖ్‌బార్ ఆహాద్) ఒకే ఒక్క హదీసు ఆధారంగా మరో అభిప్రాయం ఏర్పరచుకోడానికి వీల్లేదు. ఇబ్ను కసీర్ ప్రకారం, "ఇమామ్ జుహ్రీ ఉటంకించిన ఉస్మాన్ బిన్ ముహమ్మద్ ఉల్లేఖనంలో షాబాన్ నుండి మళ్ళీ షాబాన్ వరకు భాగ్యాల నిర్ణయాలు జరుగుతాయని వచ్చిన హదీసు ముర్సల్ హదీసు. ఇటువంటి ఉల్లేఖనాలను 'ముసూస్' (మౌలిక ఆధారాల)కు ప్రతిగా పరిగణనలోకి తీసుకోవడం జరగదు." కాజీ అబూబక్ర్ ఇబ్నుల్ అరబీ ప్రకారం, "షాబాన్ నెల మధ్య రేయికి సంబంధించిన ఏ హదీసూ విశ్వసనీయం కాదు–దాని ఘనత విషయం లోనూ, ఆ రేయి భాగ్యాల నిర్ణయాలు జరుగుతాయన్న విషయం లోనూ. కాబట్టి దానిపట్ల శ్రద్ధచూపడం జరగదు" *(అహ్కాముల్ ఖుర్‌ఆన్).*

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో



# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా(ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِي

## 4. యుద్ధాల ప్రకరణం -2

(కితాబుల్ మగాజీ)

### అధ్యాయం : 36

### హుదైబియా యుద్ధం గురించి

అల్ ఫత్హ్ సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "విశ్వాసులు వృక్షం క్రింద నీతో విధేయతా ప్రమాణం చేస్తున్నప్పుడు, అల్లాహ్ వారి పట్ల ప్రసన్నుడయ్యాడు." (48: 18)

**44)** జైద్ బిన్ ఖాలిద్(రజి) కథనం: హుదైబియా సంఘటన జరిగిన సంవత్సరం మేము ప్రవక్త మహనీయుల (సఅసమ్)తో కలసి బయలుదేరాము. ఆ సందర్భంగా ఒక రోజు రాత్రి వర్షం కురిసింది. దైవప్రవక్త(స) ఫజ్ర్ నమాజ్ చేయించిన మీదట మమ్మల్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ, "మీ ప్రభువు ఏమన్నాడో తెలుసా?" అని అడిగారు. దానికి మేము, 'అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకే బాగా తెలుసు' అని చెప్పాము. అప్పుడాయన (స) ఇలా అన్నారు: "అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు: తెల్లవారినప్పుడు నా దాసుల్లో కొంతమంది నాపై విశ్వాసం (ఈమాన్) ఉన్న స్థితిలో తెల్లవార్చారు. మరికొంతమంది నన్ను తిరస్కరించిన స్థితిలో తెల్లవార్చారు. ఎవరయితే, 'మాపై ఈ వర్షం దైవ కారుణ్యంతో, ఆయన అనుగ్రహంతో, ఆయన ఉపాధితో కురిసింద'ని అన్నాడో అతను నన్ను విశ్వసించిన వాడవుతాడు, నక్షత్రాల ప్రభావాన్ని త్రోసిపుచ్చినవాడవుతాడు. మరెవడయితే, 'ఈ వర్షం ఫలానా నక్షత్ర ప్రభావం వల్ల కురిసిందని అంటాడో, అతను నక్షత్రాలను విశ్వసించినవాడు, నన్ను తిరస్కరించినవాడయ్యాడు."

**45)** మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) మొత్తం నాలుగు ఉమ్రాలు చేశారు. ఇవన్నీ జీకఅద నెలలోనే జరిగాయి. కాని ఆయన (స) హజ్జ్‌తోపాటుగా చేసిన ఉమ్రా మాత్రం జిల్ హజ్జా నెలలో జరిగింది. హుదైబియా ఒడంబడిక జరిగిన సంవత్సరంలో కూడా ఆయన(స) ఉమ్రా ఉద్దేశ్యంతోనే వెళ్ళారు. కాని మరుసటి సంవత్సరం దానిని (ఖజా ఉమ్రాగా) జీకఅదలోనే నెరవేర్చారు. మరొక ఉమ్రాను ఆయన(స) 'జీరానా' నుండి సంకల్పించుకుని చేశారు. అక్కడ (జీరానాలో) ఆయన హునైన్ యుద్ధ ప్రాప్తిని పంపిణీ చేశారు. ఇది కూడా జీకఅద నెలలోనే జరిగింది. ఇంకొక ఉమ్రాను ఆయన(స) హజ్జ్‌తోపాటు చేశారు.

**47)** బరా బిన్ ఆజిబ్(రజి) తెలిపారు: మీరు (అల్ ఫత్హ్ సూరాలో ప్రస్తావించబడిన) విజయాన్ని 'మక్కా విజయం'గా పేర్కొంటున్నారు. మక్కా విజయం విజయమే (దానిని ఎవరూ కాదనరు). కాని మేము మాత్రం హుదైబియా యుద్ధ సందర్భంగా జరిగిన 'బయ్‌తె రిజ్వాన్'ను సిసలైన విజయంగా భావిస్తున్నాము. ఆ రోజు మేము దైవప్రవక్త(స)తో పాటు **1400** మందిమి ఉన్నాము. 'హుదైబియా' అనబడే ఒక బావి అక్కడ ఉండేది. మేము ఆ బావిలో నుంచి ఒక చుక్క నీరు కూడా మిగలకుండా తోడుకున్నాము. (నీరంతా) అయిపోయిందన్న విషయం దైవప్రవక్త(స)కు తెలిసినప్పుడు ఆయన(స) ఆ బావి దగ్గరకు వచ్చారు. బావి ప్రక్కన కూర్చుని ఒక పాత్రలో నీరు తెమ్మని ఆదేశించారు. ఆ నీటితో ఆయన వుజూ చేసి, నీరు పుక్కిలించి ప్రార్థించారు. పిదప ఆ నీరంతా ఆ బావిలో కుమ్మరించారు. మేము కొన్ని గడియల పాటు బావిని అలాగే వదిలేశాము. తరువాత మేము మాకు కావలసినంత నీరు తోడుకుని త్రాగాము. మా వాహనాలకు (పశువులకు) కూడా త్రాపాము.




**సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ**

**విశ్వసించిన ప్రజలారా! మీరు పరస్పరం ఒక నిర్ణీత కాలం కొరకు అప్పు తీసుకున్నప్పుడు, ఆ వ్యవహారాన్ని వ్రాసి పదిల పరచండి. ఇరుపక్షాల మధ్య న్యాయంగా దస్తావేజును ఒక వ్యక్తి వ్రాయాలి. .....అల్లాహ్‌కు భయపడండి. చూడండి, ఆయన మీకు ఎలాంటి మంచి విషయాలు నేర్పుతున్నాడో! అల్లాహ్ సమస్త విషయాలు ఎరిగినవాడు. (అల్ బఖరహ్: 282)**

మోయలేని బరువు అప్పు. శక్తికి మించిన బాధ్యత అప్పు. ఒకటో తేదీ వచ్చేసిందనే ఆనందాన్ని మింగేసేది అప్పు. గౌరవంగా బతుకుతున్నామనే భ్రమను బద్దలుకొడుతుంది అప్పు. అప్పుల కుప్ప పెరిగేకొద్దీ స్నేహితులు దూరం అవుతారు. ఆత్మీయులు ముఖం తిప్పుకుంటారు. ఆ పరిస్థితి ఎవరికీ వద్దు. అత్యవసరమైతే తప్పించి అప్పుల జోలికి వెళ్లొద్దు. వెళ్లినా అందులోనే ఇరుక్కుపోవద్దు. విచిత్రమేమంటే, అప్పిచ్చేవాడు బైక్ మీద తిరిగితే, అప్పు తీసుకునేవాడు కార్లో షికారు చేస్తాడు. కొందరంతే. అప్పులు చేయడానికే పుడతారు. అప్పులవారి కోసమే సంపాదిస్తారు. అప్పులు తీర్చలేకే చివరికి మరణిస్తారు. అయినా, ఎవరూ పుట్టుకతోనే నేరస్థులు కానట్టే... పుట్టుకతోనే రుణగ్రస్తులూ కారు. పరిస్థితులు ప్రేరేపిస్తాయి. అవసరాలు రెచ్చగొడతాయి. బాధ్యతలు ఉసిగొల్పుతాయి. ఇంకేముంది, అప్పుల దండయాత్ర మొదలవుతుంది.

## అంగట్లో అరువు - తల మీద బరువు

హజ్రత్ సముర బిన్ జున్దుబ్ (రజి) కథనం: దైవప్రవక్త(స) ప్రబోధనం- "(అరువుగా) పుచ్చుకున్న చెయ్యి తిరిగి ఇచ్చే వరకూ రుణపడి ఉంటుంది." (దీనిని అహ్మద్, నలుగురు ఉల్లేఖించారు. హాకిమ్ దీనిని సహీహ్‌గా ఖరారు చేశారు)

అప్పులు గుండె మీద నిప్పుల కుంపట్లు. అప్పులు ఆర్థిక లక్ష్యాలను దెబ్బతీస్తాయి. అప్పులు కలల్ని మింగేస్తాయి. ఇష్టంగా ఇల్లు కట్టుకోలేం. ధైర్యంగా పెళ్లి చేసుకోలేం. ప్రేమగా పిల్లల్ని కనలేం. ప్రశాంతంగా రిటైర్మెంటు తీసుకోలేం. ఒత్తిళ్లతో, అవమానాలతో, కోర్టు వాయిదాలతో అకాల వృద్ధాప్యం దాపురిస్తుంది. ఆరోగ్య సమస్యలు చుట్టుముడతాయి. ప్రతి అప్పూ ఓ కొత్త శత్రువును సృష్టిస్తుంది. భార్యాపిల్లలు గౌరవించరు. సమాజం చిన్నచూపు చూస్తుంది. ఏ క్షణాన రికవరీ ఏజెంట్లు తలుపు తడతారో అనే భయం నిద్రలోనూ వెంటాడుతుంది. ఆ ముప్పేట దాడిలో మనిషి జీవచ్ఛవం అవుతాడు. అప్పుల వాళ్ల వేధింపులతో, అప్పు తీర్చలేకపోయామనే అవమాన భారంతో ఆత్మహత్య చేసుకునేవారూ అనేకమంది. మనిషిని ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు త్రాపించే అప్పు గురించి కొన్ని విషయాలు తెలుసుకుందాం!

**కుచ్ తో బాత్ హై జో ఆతీ హై ఖజా రుక్ రుక్ కే**
**జిందగి ఖర్జ్ హై ఖిస్తో మే అదా హోతీ హై**

## అప్పు నిర్వచనం

భాషాపరంగా - భాగాలు విడగొట్టడం

శాస్త్ర పరంగా తిరిగి ఇస్తామన్న ఉద్దేశ్యంతో ధన, కనక వస్తువును తీసుకోవడాన్ని అప్పు - ఖర్జ్ అనంటారు.

## అప్పు ఆదేశం

ఖుర్‌ఆన్, హదీసు, ధర్మవేత్తలందరి ఏకాభిప్రాయంతో - అప్పు ఇవ్వడం, తీసుకోవడం అనుమతించబడినది.

**మీలో ఎవరయినా అల్లాహ్‌కు శ్రేష్ఠమైన రుణదానం అందజేసే వారు ఉన్నారా? ప్రతిఫలంగా ఆయన దాన్ని అనేక రెట్లు పెంచి తిరిగి మీకు అందజేస్తాడు. అల్లాహ్‌యే మీ ఉపాధిని తగ్గించేవాడు. దాన్ని వృద్ధి చేసేవాడు కూడా ఆయనే. చివరికి ఆయన సన్నిధికే మీరంతా మరలి పోవలసి ఉంది.**

**(అల్-బఖరా: 245)**

## రుణదాన ఉద్దేశ్యం

**సత్కార్యాల్లో, దైవభక్తికి సంబంధించిన పనుల్లో పరస్పరం సహకరించుకోండి. అంతేగాని, పాపకార్యాల్లో, హింసా దౌర్జన్యాల్లో మాత్రం ఎవరితోనూ సహకరించకూడదు. దేవునికి భయపడండి. ఆయన (నేరస్థుల్ని) చాలా కఠినంగా శిక్షిస్తాడని తెలుసుకోండి.**

**(మాయిదహ్: 02)**

ముస్లింలు పరస్పరం ధర్మం, దైవభక్తికి సంబంధించిన విషయాలలో సహకరించుకోవడం, వారి మధ్య సోదర బంధాలను బలోపేతం చేయడం, వారి బాధలను తగ్గించడం, పేదల అవసరాన్ని తీర్చడం, వారిపై గల అధిక రుణభారాన్ని తొలగించడం వంటి శ్రేయస్కర లక్ష్య సాధనే సర్వ శక్తిమంతుడైన అల్లాహ్ కోరుకునేది. రుణాల పేరిట జలగల్లా పేద ప్రజల రక్తాన్ని పీల్చి వారి బతుకుల్ని పిప్పి చేసే పాషాణ హృదయ వడ్డీ వ్యాపారులు చేసే ఆకృత్యాలను ఇస్లాం ఎండగడుతుంది.

## అప్పున్న వ్యక్తికి ఆర్థిక సహాయం కోరే అనుమతి ఉంది

ఖబీ'సహ్ బిన్ ము'ఖారిఖ్ (ర) కథనం: నేను ఒకరి బాధ్యత తీసుకున్నాను, ప్రవక్త (స) వద్దకు వెళ్ళి అప్పు చెల్లించటానికి అడిగాను. దానికి ప్రవక్త(స), "ఇక్కడ కొన్ని రోజులు ఉండు, మా దగ్గరకు జకాత్ ధనం వచ్చిన వెంటనే ఇవ్వమని ఆదేశిస్తాం" అని అన్నారు. ఆ తరువాత మళ్ళీ ఇలా అన్నారు, "ఓ ఖబీ'సహ్ కేవలం ముగ్గురు వ్యక్తులే అర్థించగలరు: 1) అప్పు బాధ్యత తీసుకున్నవాడు; అతడు కూడా అప్పు ఎంత ఉందో అంతే అడగగలడు, అంతకంటే ఎక్కువ అడగరాదు 2) కష్టాలకు గురయిన వాడు, అతని ధన సంపదలకు నష్టం వాటిల్లి, కరువు కాటకాలు మొదలైనవాటికి గురైతే, అతడు అవసరానికి కావలసినంత అడగగలడు. అవసరం తీరిపోయిన తర్వాత అతనికి అడిగే అర్హత లేదు 3) అతనిపై పెద్ద కష్టం వచ్చిపడి, దానివల్ల అతడు పేదవాడైపోయాడు, తినే త్రాగే ఆధారం లేకుండా పోయింది. అతని కుటుంబానికి చెందిన సజ్జనులైన ముగ్గురు వ్యక్తులు ఆ వ్యక్తి నిజంగానే పేదరికానికి గురయ్యాడని సాక్ష్యం ఇవ్వాలి. అతడు అవసరమున్నంత, అతని జీవితం నిలబడేంత అడగవచ్చు. అతని అవసరం తీరగానే అర్థించడం తగదు. కేవలం ఈ ముగ్గురు వ్యక్తులే అర్థించగలరు. వీరు తప్ప ఇతరులు అర్థించటం నిషిద్ధం. అనవసరంగా అర్థించేవాడు అధర్మ సంపాదన తింటాడు. (ముస్లిమ్)

## రుణదాత ఘనత

ఒక ముస్లిం మరొక ముస్లింకు రెండుసార్లు రుణం ఇస్తే, అందులో ఒకసారి ఇచ్చిన రుణానికిగాను అతని సదఖా చేసిన పుణ్యం కూడా అదనంగా లభిస్తుంది అన్నారు దైవప్రవక్త ముహమ్మద్ (స). (ఇబ్ను మాజహ్)

దైవప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు: నేను ఇస్రా మేరాజ్ చేసిన రాత్రి - పై లోకాల్లో స్వర్గపు తలుపు మీద ఇలా వ్రాసి ఉండటం చూశాను. దానానికి పదింతలు పుణ్యం, రుణానికి 18 రెట్లు పుణ్యం. ఏమిటి దానం కన్నా రుణానికి లభించే పుణ్యం ఎక్కువుందేమిటి? అని దైవదూత జిబ్రయీల్ (అ)ను అడిగాను. అందుకాయన- సాధారణంగా దానం స్వీకరించే వ్యక్తి దగ్గర కొంత దానం ఉంటుంది. దానం కొన్ని సందర్భాలలో ధనికులకు కూడా లభించవచ్చు. అదే అప్పు అడిగే వ్యక్తి అత్యవసరం ఉంటే తప్ప అడగడు అని బదులిచ్చారు. (ఇబ్ను మాజహ్)

## ఇతరుల అప్పు తీర్చేవాని ఘనత

హ'జ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రబోధించారు: "విశ్వాసికి ప్రపంచంలో ఎదురయ్యే కష్టాలలోని ఒక కష్టాన్ని గనక ఎవడైనా దూరం చేస్తే, అల్లాహ్ పరలోకంలో అతడికి ఎదురయ్యే కష్టాలలోని ఒక కష్టాన్ని దూరం చేస్తాడు. ఎవరైనా (ఆర్థిక) ఇబ్బందుల్లో ఉన్న ఒక అభాగ్యునికి సౌలభ్యాన్ని చేకూరిస్తే అల్లాహ్ వారికి ఇహపరాల్లోనూ సౌలభ్యాన్ని ప్రసాదిస్తాడు. ఎవరైనా ఒక ముస్లిం (పాపాల)ను మరుగు పరిస్తే అల్లాహ్ ఇహలోకంలోనూ, పరలోకంలోనూ అతని పాపాలను మరుగుపరుస్తాడు. దాసుడు తన సోదరుడికి సహాయం చేస్తున్నంతకాలం అల్లాహ్ దాసునికి సహాయం చేస్తూ ఉంటాడు".

(ముస్లిం)

వేరొక ఉల్లేఖనంలో- పరలోకం పొందాలనుకునే వ్యక్తి, విశ్వాసికి ప్రపంచంలో ఎదురయ్యే కష్టాలలోని ఒక కష్టాన్ని గనక దూరం చేస్తే, అతని మీద ఉన్న అధిక భారాన్ని తొలగిస్తే దానికి ప్రతిగా అల్లాహ్ పరలోకంలో అతడికి ఎదురయ్యే కష్టాలలోని ఒక కష్టాన్ని దూరం చేస్తాడు. ఒక బరువును తొలగిస్తాడు. అలాగే అతనికి తన అర్ష్ (సింహాసనం) నీడన చోటు కల్పిస్తాడు అని ఉంది.

## అప్పు మూల సూత్రాలు మూడు

**1) ఫార్ములా :** ఇది ప్రతిపాదన, అంగీకారం. నేను మీకు అప్పుగా ఇస్తున్నాను. నేను రుణం తీసుకున్నాను, ఫలానా సమయానికి తిరిగి చెల్లిస్తాను. లేదా అతను నా నుండి ఇంత పైకం అప్పుగా తీసుకున్నాడు నోటి మాట లేదా వ్రాతపూర్వక ఒప్పందం. ఇది ఇద్దరి ఏకాభిప్రాయంతో కూడిన ఒప్పందం.

**2) రెండు ఒప్పంద పక్షాలు :** రుణదాత, రుణగ్రహీత. వీరికి కొన్ని షరతులున్నాయి. 1) వారు యవ్వనులయి ఉండాలి. పిల్లల ఋణం చెల్లదు. 2) బుద్ధిమంతులై ఉండాలి. మతి చలించిన వారి, పిచ్చివారి రుణం చెల్లదు. 3) రుణమిచ్చే వ్యక్తి రుణ వస్తువుకి యజమాని అయి ఉండాలి. ఒకరి ఆస్తికి సంరక్షకునిగా ఉన్న వ్యక్తి ఆ సొమ్మును ఋణంగా ఇవ్వకూడదు.

3) రుణంగా ఇచ్చే వస్తువు ముందుండాలి. లేని వస్తువు ఋణం చెల్లదు.

## రుణగ్రస్తుని పట్ల మృదువైఖరి అభిలషణీయం

**ఒకవేళ రుణగ్రస్తుడు ఇబ్బందుల్లో ఉంటే పరిస్థితి చక్కబడే వరకు అతనికి అవకాశమివ్వండి. రుణం మాఫీ చేస్తే మరీ మంచిది. మీరు గ్రహించగల్గితే ఇది మీకెంతో శ్రేయస్కరమైనది. మీరంతా చివరికి అల్లాహ్ సన్నిధికి చేరుకోవలసిన దినం గురించి కాస్త భయపడండి. (ఆ రోజు) ప్రతి వ్యక్తికీ అతను చేసుకున్న కర్మలకు పూర్తి ప్రతిఫలం లభిస్తుంది. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు. (అల్-బఖరా: 280-281)**

## పేద రుణగ్రస్తుడికి వ్యవధి నివ్వడం పుణ్యప్రదం

హజ్రత్ హుజైఫా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు: "మీ పూర్వీకులలో ఒక వ్యక్తి ఆత్మకు దైవదూతలు ముందుకు వచ్చి స్వాగతం చెప్పారు "(నిన్నింతగా స్వాగతించాలని మాకు ఆజ్ఞ జారీ కావడానికి కారణం) నువ్వేమయినా పుణ్యకార్యం చేసి ఉన్నావా?" అని అడిగారు ఆ దైవదూతలు అతడ్ని. దానికా వ్యక్తి "నేను నా ఉద్యోగిని వసూళ్ళకు పంపేటప్పుడు, నీవు నిరుపేద అయిన రుణగ్రస్తుణ్ణి మన్నించి వదలిపెట్టు. దాని ద్వారా అల్లాహ్ కూడా మన పట్ల మన్నింపు వైఖరిని అవలంబించవచ్చు అని ఆదేశించేవాణ్ణి" అని అన్నాడు. అందువల్లనే అల్లాహ్ అతని తప్పుల్ని క్షమించి అతని పట్ల మంచిగా వ్యవహరించమని దైవ దూతలను ఆజ్ఞాపించాడు". (సహీహ్ బుఖారీ)

## పేద రుణగ్రస్తుడికి సొమ్మును కొంత మాఫీ చేయడం పుణ్యప్రదం

హజ్రత్ కాబ్ బిన్ మాలిక్ (రజి) కథనం: నేనొక రోజు మస్జిదులో అబ్దుల్లా బిన్ అబీ హద్ద్ (రజి)ని నాకివ్వాల్సిన బాకీ ఇవ్వమని నిలదీశాను. మేమిద్దరం (అరచుకుంటూ) బిగ్గరగా మాట్లాడుకో సాగాము. మా అరుపులు ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న దైవప్రవక్త (స)కు విన్పించాయి. ఆయన వెంటనే లేచి తమ కుటీరం తెరను పైకెత్తి "కాబ్!" అని పిలిచారు. నేను "వస్తున్నా నండీ" అన్నాను. అప్పుడాయన "నీకు రావలసిన అప్పులో కొంచెం తగ్గించుకో" అని చెప్పారు. చేత్తో సూచిస్తూ 'సగం తగ్గించుకో' అన్నారు."మీరెలా ఆజ్ఞాపిస్తే అలా చేస్తా"నన్నాను నేను. "మరయితే లే వెంటనే అతని హక్కు నెరవేర్చు"(అంటే తాత్సారం చేయకుండా జరిగిన తీర్పు ప్రకారం ఆచరించు) అని ఆదేశించారు.

(సహీహ్ బుఖారీ)

## అవసరంపై అప్పు తీసుకోవడం మంచిదే. కాని దాన్ని ఉత్తమ పద్ధతిలో తిరిగి చెల్లించడం అంతకంటే మంచి విషయం

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: ఒక వ్యక్తి దైవప్రవక్త(స) దగ్గరికొచ్చి తన అప్పు తిరిగిచ్చేయమని ఒత్తిడి చేయసాగాడు. ఆ సందర్భంలో అతను పరుష పదజాలాన్ని ఉపయోగించాడు. ప్రవక్త సహచరులు (రజి) ఈ మాటలు విని అతడ్ని దూషించడానికి ఉపక్రమించారు. అయితే దైవప్రవక్త(స) (వాళ్ళను వారిస్తూ) "అతడ్ని ఏమీ అనకండి, వదిలేయండి. తన సొమ్ము తీసుకో వలసిన వ్యక్తికి ఇలా కఠినంగా మాట్లాడే హక్కుంది" అని అన్నారు. ఆ తర్వాత ఆయన "అతను నాకిచ్చిన ఒంటె వయస్సు ఎంత ఉందో అంతే వయస్సు గల ఒంటెను అతనికి ఇచ్చి వేయండి" అని అన్నారు. అప్పుడు ప్రవక్త సహచరులు (రజి) "దైవప్రవక్తా! అతని ఒంటెలాంటి ఒంటె లేదు. మా దగ్గర ఉన్నవన్నీ అంతకంటే మంచి ఒంటెలే" అని అన్నారు. "ఆ మంచి ఒంటెనే ఇవ్వండతనికి. అప్పు తీర్చడంలో ఉత్తముడే మీలో ఉత్తముడు" అన్నారు ఆయన. (సహీహ్ బుఖారీ)

## ధనికుడు అప్పు తీర్చడంలో ఆలస్యం చేయకూడదు

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "ధనికుడు అప్పు తీర్చడంలో ఆలస్యం చేయడం అన్యాయం. రుణగ్రస్తుడు తన రుణబాధ్యతను, దాన్ని తీర్చే స్తోమత గల వ్యక్తికి అప్పగించినపుడు రుణదాత (అందుకు అంగీకరించి), తన అప్పు గురించి ఆ బాధ్యత తీసుకున్న వ్యక్తినే అడగాలి". (సహీహ్ బుఖారీ)

ధనికులైనా, మధ్యతరగతి వ్యక్తులైనా, పేద ప్రజలయినా

సౌకర్యం ఉంటే వీలైనంత త్వరగా అప్పు తీర్చేయాలి. ఎందుకంటే, ఎవరికి ఎప్పుడు ఏ ఇబ్బంది కలుగుతుందో ఎవరికీ తెలియదు. అప్పు తీర్చాలి అని అనుకునే వ్యక్తి దాని కోసం తొందరపడాలి. ఆలస్యం చేస్తే అతను వ్యాధి బారినయినా పడవచ్చు లేదా తనకు సమస్య ఏదయినా ఎదురవ్వవచ్చు.. అలాగే ఎవరికి ఎంత అప్పు ఇవ్వాలో వ్రాత పత్రంలో వ్రాసి పెట్టుకోవాలి.

### ఉత్తమ ఋణం - ఉత్త రుణంగా మారిన వేళ...

అప్పు అంటే కొందరి దృష్టిలో- 'తమకు ఏదో అవసరం కలిగినప్పుడు ఇరుగు పొరుగు వారి దగ్గర నుంచి గానీ, గ్రామస్థుల నుంచి గాని, లేక ఓ బ్యాంక్ లాంటి సంస్థలో గానీ మళ్లీ ఇస్తామనే భ్రమ పెట్టి, తీసుకొనిన ధనము, ధనేతర వస్తువు. ఆహా! ఎంత గొప్ప నిర్వచనం! పై నిర్వచనంలో 'మళ్లీ ఇస్తామనే భ్రమ పెట్టి' అన్న వాక్యం కొసమెరుపు. 'అప్పులు ఎలా చేయాలి? ఎవరి దగ్గర చేయాలి? ఎలా ఎగ్గొట్టాలి' అని వీరికి తెలిసినంతగా వేరెవ్వరికీ తెలిసి ఉండదు. ఖర్జె హసనా.. అని తీసుకొని.. దాన్ని ఖర్జ్ హస్సనాగా మార్చుకొని - రుణదాత కనబడ్డప్పుడల్లా ఊరించి... కవ్వించి... నవ్వించి... అరువు తెచ్చుకున్న నవ్వుల అత్తర్లు జల్లేసి జారుకుంటారు. వీరినుద్దేశించే బహుశా సిగ్గు లేని జన్మ అన్నారేమో పెద్దలు. చట్టాన్ని ఆసరాగా చేసుకొని రుణదాతను వేధించడం కూడా అనేక ప్రాంతాల్లో జరుగుతున్నది.

### అప్పు అవసరమే కానీ ...

ఒక అప్పు సురక్షితం, రెండో అప్పు ప్రమాదకరం, మూడో అప్పు దివాలాకు ఆమడ దూరం. కాబట్టి, మొదటి అప్పు తీరేవరకూ రెండో అప్పు చేయకూడదనే నియమం పెట్టుకోవాలి. ఇంటి అద్దె, పిల్లల స్కూలు ఫీజులు, నిత్యావసరాలు... మొదలైన వాటికి కూడా చేబదుళ్లు తీసుకుంటున్నామంటే, క్రమంగా రుణ వలయంలో చిక్కుకుంటున్నామని అర్థం. అప్పులు తీర్చడానికో, వడ్డీలు కట్టడానికో మళ్లీ అప్పులు చేయడం రెండో తుఫాను హెచ్చరికతో సమానం. అప్పు ఇచ్చినవాడు మేలు కోరుతాడు, అప్పు తీసుకున్న వాడు కీడు కోరుతాడు అంటారు. ఎందుకో ఒకసారి ఆలోచించండి మీకే అర్థం అవుతుంది.

**(మిగతా వచ్చేవారం)**

## నవంబర్ 15, 16, 17 తేదీల్లో జమాఅతె ఇస్లామీ హింద్ ఆలిండియా సమావేశాలు



జమాఅతె ఇస్లామీహింద్ ఆలిండియా సభ్యుల సమావేశాలను జయప్రదం చేయాలని, ప్రతీ సభ్యుడు ఈ సమావేశాల్లో విధిగా పాల్గొనాలని సమావేశాల బాధ్యులు అబ్దుల్ జబ్బార్ సిద్దీఖీ అన్నారు. నవంబర్ 15,16,17 తేదీల్లో హైదరాబాద్ శివారులోని వాదియే హుదాలో మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో జమాఅతె ఇస్లామీహింద్ జాతీయ స్థాయి నాయకులు ప్రసంగిస్తారని ఆయన చెప్పారు. అక్టోబర్ 11న జబ్బార్ సిద్దీఖీ జమాఅత్ కార్యకర్తలతో సమావేశాల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం నలుమూలల నుంచి జమాఅత్ సభ్యులు వేలాదిగా తరలి రానున్న ఈ సమావేశాల ఏర్పాట్లను ఆయన సమీక్షించారు. సమావేశాలకు హాజరయ్యే అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా తగిన ఏర్పాట్లను చేస్తున్నామని ఆయన వివరించారు. ఆయా ప్రాంతాల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా ఆతిథ్య ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చలి, ఎండ, వర్షం నుండి రక్షణకోసం అందుకు తగ్గట్టుగానే జర్మనీ టెంట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సుమారు పదేళ్ల తర్వాత జరిగే ఈ సమావేశాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. పలు అంశాలపై తీర్మానాలు చేయనున్నారు. జమాఅతె ఇస్లామీహింద్ తెలంగాణ ఉపాధ్యక్షులు ముహమ్మద్ అజహరుద్దీన్‌తో కలిసి సమావేశ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ప్రతీ సభ్యుడూ ఈ సమావేశాల్లో పాల్గొనడానికి కృషిచేయాలని అజహరుద్దీన్ అన్నారు. ఇజ్తెమా ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని, వచ్చే అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని అజహరుద్దీన్ చెప్పారు.

**రిపోర్టు : షాఫుల్ హమీద్ షేఖ్**




**ప్రవక్త వారికి ఆయన వాక్యాలను వినిపిస్తున్నాడు, వారి జీవితాలను తీర్చిదిద్దుతున్నాడు, వారికి గ్రంథాన్ని, వివేకాన్ని బోధిస్తున్నాడు. వాస్తవానికి దీనికి పూర్వం వారు పూర్తిగా మార్గం తప్పి ఉన్నారు. (62/2)**

పైన పేర్కొనబడిన వాక్యం ప్రకారంగా ప్రవక్త(సల్లల్లాహు అలైహి వ సల్లం) అవతరించిన ఉద్దేశం చాలా స్పష్టంగా మన ముందు ఉంచబడింది. ప్రవక్త (స) పూర్తి జీవితాన్ని పరిశీలిస్తే ఆయన ప్రతి వాక్యంలోనూ ప్రతి నడవడికలోనూ మనకు ఒక ఆదర్శం తప్ప ఏది కానరాదు. ప్రవక్త (స) ప్రతి నడవడికను అనుసరిస్తూ మన జీవితాన్ని దాని ప్రకారంగా మలుచుకునే ప్రధాన ఉద్దేశంతో అధ్యయనం చేస్తాము.

ఒక శిక్షకునిగా, బోధకునిగా ఆయన (స) అవతరించారని తెలిసినప్పుడు ఆయా పాత్రలను పోషించిన విధానాన్ని తప్పక పరిశీలించాలి.

ప్రవక్త (స) ప్రభవింపజేయబడినప్పుడు అరబ్బు సమాజం రెండు విధాల పతనావస్థలలో కూరుకుపోయి ఉంది. ఇటు వ్యక్తిగత నైతిక విలువల పరంగా, అటు సామాజిక విలువల పరంగానూ. మనిషి అనేక సమస్యలతో సతమతమవుతున్న కాలం అది.

మానసిక, వ్యక్తిగత శిక్షణలలో భాగంగా వారిని నైతికంగా తీర్చిదిద్దడం కొరకు ప్రవక్త (స) వారి అలవాట్లపై దృష్టి సారించారు. దాని కొరకు ఆయన (స) వారి హృదయ ప్రక్షాళన వైపునకు శ్రద్ధ చూపించారు. వారిని కూడా హృదయ ప్రక్షాళన వైపున శ్రద్ధ చూపమని ప్రేరేపించారు. అనునిత్యం ఆత్మశుద్ధి చేసుకోమన్నారు.

పరిశుద్ధతను పాటించిన వాడు తప్పక సాఫల్యం పొందుతాడు
(దివ్య ఖుర్ఆన్ 87:14)

నిశ్చయంగా తన ఆత్మను పరిశుద్ధపరచుకున్న వ్యక్తి సఫలుడయ్యాడు, దానిని అణచివేసిన వాడు విఫలుడయ్యాడు.
(దివ్య ఖుర్ఆన్ 91: 9,10)

అనే ఖుర్ఆన్ బోధనలలో కొనసాగిన ప్రవక్త(స) శిక్షణా శైలి ఆ అరబ్బు దేశ జీవితాలనే పరిశుభ్రపరిచింది. అంధకారంతో నిండిన వారి జీవితాలలో వెలుగులు నింపింది. నిరాశ నిస్పృహలతో, మానసిక సమస్యలతో, వ్యక్తిత్వ రుగ్మతలతో కొట్టుమిట్టాడుతున్న జనానికి సరైన మార్గాన్ని, జీవితాశయాన్ని, బాధ్యతాయుతమైన జీవితాన్ని పరిచయం చేసింది.

వారి పరస్పర సంబంధాలను ప్రవక్త (స) మెరుగుపరిచారు. సత్సంబంధాలు పరస్పరం ఎలా కలిగి ఉండాలో నేర్పించారు. చిన్నచిన్న సమస్యలతో వారి సామాజిక జీవితాన్ని, సామాజిక అభివృద్ధిని పణంగా పెట్టే ఆలోచన తీరు నుండి సమాజాభివృద్ధికై కృషి చేస్తూ సమాజంలో అందరితో పాటు అత్యంత నైతిక

విలువలతో ఎలా మెలగాలో వారికి బోధించారు. సామాజిక జీవితం అంటే పగలు, ప్రతీకారాలు, పోట్లాటలు కాదు. పరస్పరం సోదర భావం, ప్రేమానురాగాలు విరజిమ్మాలని అత్యుత్తమ శిక్షణ ఇచ్చారు.

ప్రవక్త (స) మానవాళి కోసం పాటుపడుతూ, వారితో తనకున్న సంబంధాన్ని గురించి వివరిస్తూ ఇలా ప్రవచించారు, నాకు మీకు ఉన్న సంబంధం ఎటువంటిది అంటే దానిని ఈ ఉపమానం ద్వారా తెలుసుకోవచ్చు. “ఒక వ్యక్తి నిప్పు రాజేస్తాడు. ఆ నిప్పు చుట్టూరా దీపపు పురుగులు వచ్చి దానిలో పడుతున్నాయి. ఆ వ్యక్తి ఆ పురుగులను దానిలో పడకుండా కాపాడడానికి ప్రయత్నిస్తున్నాడు. మీరు కూడా నరకాగ్నిలో పడుతుంటే మీ నడుమును పట్టుకుని లాగి నేను ఒడ్డున కూర్చో పెడుతున్నాను”.

ఈ ప్రవచనం ద్వారా ప్రవక్త (స) ఒక సంస్కర్తగా తన సమాజం కోసం ఎంతగా పరితపించేవారో ఆలోచించుకోవచ్చు. సమాజం పూర్తిగా నరకానికి చేరువయ్యే పరిస్థితుల్లో ఉన్నప్పుడు ప్రవక్త (స) ఒక బోధకునిగా, మార్గదర్శిగా ప్రభవించి వారికి ఎంతగా శిక్షణ ఇచ్చారంటే ఇహలోకంలోనే కొందరు అనుచరులకు స్వర్గపు శుభవార్త వినిపించబడింది.

మనిషి వ్యక్తిత్వ సంస్కరణకై సమాజ సంస్కరణకై కేవలం ఖుర్ఆన్ అవతరణ మాత్రమే జరగలేదు, దానితో పాటుగా ప్రవక్త(స) ఒక సంస్కర్తగా, బోధకునిగా, అవతరింప చేయబడిన ఖుర్ఆన్ గ్రంథానికి ఆదర్శమూర్తిగా ప్రభవింపజేయబడ్డారు. ప్రజలు గ్రంథంతో పాటుగా, గ్రంథ బోధకునితో కూడా ప్రయోజనం పొందాలనేది ఉద్దేశ్యం. ఆయన(స) మార్గదర్శిగా ఎంచుకున్న మార్గాలు పలు విధాలు. అందులో ఒకటి చుట్టుపక్కల కుగ్రామాల నుండి కొందరు అనుచరులు ప్రవక్త (స)కు తోడుగా ఉండి ఆయన బోధనల ద్వారా పూర్తిగా ప్రయోజనం పొందే ఉద్దేశంతో మదీన నగరంలోనే మస్జిద్ సెహన్ (అరుగు) పై బస చేశారు. వారిని అస్హాబె సుఫ్ఫ (అరుగువారు)గా పిలుచుకునేవారు. చరిత్రలో వీరు శిక్షణ పొందిన పద్ధతి బహు ప్రత్యేకమైనది. వారిలో కొంతమంది ఉదయం పూట కష్టపడి సంపాదించుకుని, సాయంత్రం పూట ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్ద విద్య నేర్చుకునేవారు. ప్రవక్త (స) కేవలం వారి విద్య గురించి మాత్రమే కాకుండా ఎవరైతే వారిలో నుంచి ఉదయం పూట కూడా సంపాదించకుండా పూర్తి సమయాన్ని విద్యకై, శిక్షణకై కేటాయించేవారో, వారి కొరకు భోజన ఏర్పాట్ల గురించి అనుచరులతో మాట్లాడి ఏర్పాటు చేసేవారు. అలా ఏర్పాటు చేసేటప్పుడు ఏ ఒక్కరూ తన గురించి ప్రవక్త (స) సమక్షంలో విన్నవించుకోవడానికి వెనుకాడే వారు కాదు. వారి బాధలు, కష్టాల గురించి చెప్పుకునేవారు. ప్రవక్త (స) వారిని అత్యుత్తమ రీతిలో మందలించేవారు. ఒక మార్గదర్శక బోధకునిగా ప్రవక్త (స)లో అత్యంత మృదుత్వం ఉండేది. సమాజంలో ఒకరిగా కలిసిపోయి తన ఆదర్శవంతమైన నమూనాతో ఆచరణాత్మకంగా, తమ అత్యుత్తమ బోధనలతో ప్రవచనాపరంగా, తమ చిన్న చిన్న వాక్యాలతో, సైగలతోనే ఎంతో ఉన్నతంగా మార్గదర్శనం చేసేవారు.

ఒకసారి హజ్రత్ అబూజర్ గిఫారీ (ర.అ) బోర్లా పడుకుని ఉంటే, ప్రవక్త (స) ఆయన వీపుపై చరుస్తూ ఏమిటి ఇలా పడుకున్నారు? ఇలా పడుకుంటే షైతాను పద్ధతిలో పడుకున్నట్టే అంటూ ప్రేమతో అన్నారు...

ఇలా ప్రవక్త (స) అత్యంత విలువైన పదాలను వాడుతూ, బహు స్వల్పమైన పద్ధతులను ఎంచుకుంటూ తమ శిక్షణను కొనసాగించే వారు.

ఒక శిక్షకుడు తన విద్యార్థుల పట్ల తాను ముందుగా ఎలాంటి నమూనాను ఉంచాలో, వారితో ఎంత ఉన్నతంగా ప్రవర్తించాలో ప్రవక్త(స) జీవితంలో ఆ కోణంలో దొరికే ఉదాహరణలు కోకొల్లలు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన అనుచరులతో మెలిగే తీరు, వల్లించే ప్రేమ ఎనలేనిది. అందుకే వారు ప్రవక్త (స) వారిపై అమితమైన ప్రేమను కురిపించేవారు. వారి సంస్కరణ పై ఎంత శ్రద్ధ చూపేవారు అంటే అనుచరులు తమ వలన దొర్లిన పొరపాట్లను స్వయాన వారే వచ్చి ప్రవక్త (స) సమక్షంలో వినిపించుకుని వాపోయేవారు. ఒక మనిషి తన వ్యక్తిగత పొరపాటును తన సంస్కర్త దగ్గర ఒప్పుకోవడం అంటే మామూలు విషయం కాదు. అలా విన్నవించుకుంటూ పరిష్కార మార్గాన్ని చూపమని కోరడం అంటే ఆ సంస్కర్త ప్రవర్తించే తీరు ఎలాంటిదో ఊహించుకోవచ్చు.

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
గీటురాయి
వారపత్రిక




**రసాయన శాస్త్రం** లేదా కెమిస్ట్రీ పితామహుడి పేరు మీకు తెలుసా. ఆధునిక రసాయనశాస్త్ర పితామహుడిగా పేరుపొందిన శాస్త్రవేత్త జాబిర్ ఇబ్నె హయ్యాన్. ఆయన ప్రపంచానికి అందించిన సేవలేమిటో చూద్దాం. అసలు కెమిస్ట్రీ అనే ఇంగ్లీసు పదం కూడా కీమియా అనే అరబీ పదం నుంచి వచ్చింది.

జాబిర్ పూర్తి పేరు అబూ మూసా జాబిర్ ఇబ్నె హయ్యాన్ అల్ అజ్దీ. ఈయన్ను అల్ హర్రానీ అని కూడా పిలిచేవారు. అల్ సూఫీ అని కూడా పిలిచేవారు. ఆధునిక ఫార్మసీకి పునాదులేసిన శాస్త్రవేత్తగా ప్రపంచం ఈయన్ను గుర్తించింది. యూరోపియన్లు ఈయన్ను గెబర్ అంటారు. ఈరాన్ లోని ఖురాసాన్ ప్రాంతంలో ఉన్న తుస్ నగరంలో క్రీ.శ. 721లో జన్మించారు. ఆయన తండ్రి పేరు హయ్యాన్ అల్ అజ్దీ. ఆయన ఒక అత్తార్. అంటే మందులు తయారు చేసి అమ్మేవాడు. ఇప్పటి ఫార్మసిస్టు అనవచ్చు. ఎమన్ లోని అరబ్బు తెగ అజ్ద్ కు చెందిన కుటుంబం నుంచి వచ్చారు. ఉమయ్యు ఖలీఫాల కాలంలో ఈ కుటుంబం ఇరాక్‌లోని కూఫాలో నివసించేది. ఉమయ్యా ఖలీఫాలపై అబ్బాసీలు తిరుగుబాటు చేసినప్పుడు జాబిర్ తండ్రి హయ్యాన్ అబ్బాసీలకు మద్దతిచ్చారు. ఆయన కూఫా నుంచి ఈరాన్ వలస పోవలసి వచ్చింది. అక్కడే జాబిర్ జన్మించారు. కాని హయ్యాన్‌ను ఉమయ్యా సేనలు పట్టుకుని మరణశిక్ష విధించాయి. ఈ కుటుంబం అక్కడి నుంచి ఎమన్‌కు తప్పించుకు వెళ్ళగలిగింది. జాబిర్ అక్కడే ప్రముఖ పండితుడు హర్బీ అల్ హిమ్యారి వద్ద చదువుకున్నారు. అబ్బాసీలు విజయం సాధించిన తర్వాత తిరిగి కూఫాకు వచ్చారు. ఆయన ఇమామ్ జాఫర్ అల్ సాదిక్ వద్ద కూడా చదువుకున్నారని తెలుస్తోంది. ఆయన రసాయనశాస్త్రం, ఫార్మసీ, తత్వశాస్త్రం, ఖగోళశాస్త్రం, వైద్యం చదువుకున్నారు. ఖలీఫా హారూన్ అల్ రషీద్ కాలంలో ఆయన దర్బారులో శాస్త్రవేత్తగా ఉండేవారు. ప్రధానమంత్రి బర్మాకిడ్ వ్యక్తిగత వైద్యునిగా పనిచేసేవారు. క్రీ.శ.815లో 94 సంవత్సరాల వయసులో ఆయన మరణించారు.

జాబిర్ అల్ హయ్యాన్ దాదాపు 300 పుస్తకాలు తత్వశాస్త్రంపై రాశారని, 1300 పుస్తకాలు యంత్రాలపై రాశారని, రసాయన శాస్త్రానికి సంబంధించి వందలాది పుస్తకాలు రాశారని తెలుస్తోంది. అరబీ భాషలో ఈయన రాసిన ఈ అసంఖ్యాక పుస్తకాల్లో కొన్నింటికి ఆయన తర్వాత ఆయన శిష్యులు అనుబంధాలు చేర్చడం జరిగి ఉండవచ్చని మరికొందరి అభిప్రాయం. జాబిర్ రాసిన అనేక పుస్తకాల్లో- కితబల్ రహ్మా అల్ కబీర్ అంటే కారుణ్య గ్రంథం, కుతుబల్ మియావల్ అస్నా అష్రా అంటే నూటపన్నెండు పుస్తకాల సంకలనం, కితాబల్ సబీన్ అంటే డెబ్బయి పుస్తకాల సంకలనం, కుతుబల్ మవాజిన్ అంటే సమతుల్యాల పుస్తకం, కితాబల్ ఖమ్స్ మియా అంటే ఐదువందల పుస్తకాల సంకలనం ఉన్నాయి. ఈ పుస్తకాల్లో చాలా పుస్తకాలు లాటిన్ భాషలోకి అనువాదం అయ్యాయి. ఆయన రాసిన ఇతర పుస్తకాల్లో ముఖ్యమైనవి కితాబల్ జుహ్రా అంటే శుక్రగ్రహ గ్రంథం. నిజానికి ఇది రసాయనశాస్త్ర గ్రంథం. ఈ గ్రంథాన్ని ఆయన ఖలీఫా హారున్ రషీద్‌కు అంకితం ఇచ్చారు. రసాయన శాస్త్రంలో ఆయన రాసిన పుస్తకాలు, కితాబల్ కీమియా అంటే రసాయన శాస్త్ర గ్రంథం, కితాబల్ సబీన్ అంటే డెబ్బయి పుస్తకాల సంకలనం అనేక యూరోపియన్ భాషల్లోకి అనువాదమయ్యాయి. ముందుగా

లాటిన్ భాషలోకి అనువాదమయ్యాయి. ఈ అనువాదాలు యూరపులో అనేక శతాబ్దాల పాటు ప్రఖ్యాతి పొందాయి. ఆధునిక రసాయనశాస్త్రాన్ని ప్రభావితం చేసిన పుస్తకాలివి. ఆయన రాసిన మరో పుస్తకం కితాబల్ అహ్జార్ అంటే శిలల గ్రంథం. ఈ పుస్తకాన్ని దాదాపు కోడ్ భాషలో ఆయన రాశారు. దీన్ని అందరూ అర్థం చేసుకోలేరు. ఆయన పంథాలో రసాయనశాస్త్రాన్ని చదివిన వారు మాత్రమే అర్థం చేసుకోగలరు. ఇంగ్లీషులో ఒక పదం ఉంది. గిబ్బరిష్ అనే పదం. అంటే అర్థం కాని గజిబిజి మాటలని భావం. ఈ పదం జాబిర్ రాసిన ఈ పుస్తకం వల్లనే వచ్చింది. జాబిర్‌ను యూరోపియన్లు గెబర్ అనేవారు. ఈ పుస్తకం వల్ల గెబరిష్ కాస్త గిబ్బరిష్ అయ్యింది. ఈ పుస్తకాన్ని అలాంటి కోడ్ భాషలో ఆయన రాశారు.

రసాయనశాస్త్రంలో ప్రయోగపద్ధతిని ప్రవేశపెట్టింది జాబిర్. ఆధునిక రసాయన శాస్త్రంలో ఉపయోగిస్తున్న అనేక రసాయన ప్రక్రియలను కనిపెట్టారు. క్రిస్టలైజేషన్ అంటే స్ఫటికీకరణ, కాల్సినేషన్ అంటే భస్మీకరణ, సబ్ లిమేషన్ అంటే ఉత్పాతనం, ఇవాపరేషన్ అంటే ఆవిరిగా మార్చడం, సింథసిస్ ఆఫ్ యాసిడ్ అంటే ఆమ్లాల రసాయన సంశ్లేషణ వంటి ప్రక్రియలు ప్రవేశపెట్టారు. హైడ్రోక్లోరిక్ యాసిడ్, నైట్రిక్ యాసిడ్, ఎసిటిక్, టార్టారిక్ యాసిడ్లు ఇందులో ఉన్నాయి. ఆయన తాను తయారు చేసిన గొప్ప ఆవిష్కరణ అలెంబిక్ ఉపయోగించి డిస్టిల్లేషన్ అంటే స్వేదనం చేసేవారు. అలెంబిక్‌ను ఇంగ్లీషులో అంబయిక్ అంటారు. రసాయన శాస్త్రంలో ఆయన సాధించిన అనేక విజయాలున్నాయి. అనేక లోహాలను ఆయన తయారు చేశారు. ఉక్కును అభివృద్ధి చేశారు. వస్త్రాలకు వేసే రంగులను తయారు చేశారు. తోలు పరిశ్రమలో ట్యానింగ్ చేయడం అభివృద్ధి చేశారు. వాటర్ ప్రూఫ్ వస్త్రాలకు వార్నిషింగ్ చేయడం నేర్పారు. గాజు తయారీలో మాంగనీస్ డై ఆక్సయిడ్ ఉపయోగించాలని కనిపెట్టారు. ఇనుము తుప్పు పట్టకుండా పద్ధతులు కనిపెట్టారు. పెయింట్లు, గ్రీజులు కనిపెట్టారు. బంగారాన్ని కరిగించే అక్వా రిగియాను కనిపెట్టారు. ఖనిజాలను, ఆమ్లాలను కనిపెట్టడం ఆయన సాధించిన ముఖ్యమైన విజయాల్లో ఒకటి.

ప్రకృతిలోని మూలకాలను జాబిర్ మూడు వర్గాలుగా విభజించారు. మొదటి వర్గం స్పిరిట్స్ లేదా కాస్త వేడి తగిలితే ఆవిరై పోయేవి, లేదా వాయు రూపంలో ఉండేవి. రెండవ వర్గం లోహాలు అంటే బంగారం, వెండి, సీసం వగైరాలు. మూడవ వర్గం శిలలు అంటే పొడి పొడిగా చేయగలిగినవి. రసాయన మూలకాల ఆధునిక వర్గీకరణకు పునాది వేసింది ఈ వర్గీకరణమే.

మధ్యయుగాల కాలంలో రసాయన శాస్త్రం ప్రత్యేకంగా ఉండేది కాదు. అల్కెమీ ఉండేది. అంటే రసవాద శాస్త్రం. నేటి రసాయన శాస్త్రానికి పునాది రసవాదంలోనే ఉంది. సాధారణంగా రసవాదులు బంగారం తయారు చేయాలనే ప్రయత్నాలు చేసేవారు. కాని జాబిర్ ప్రయోగాలు అలాంటివి కావు. ఆయన మౌలిక రసాయన పద్ధతులను అభివృద్ధి చేశారు. ప్రయోగపద్ధతులను రూపొందించి, రసాయన చర్యలను, వాటి సూత్రాలను అధ్యయనం చేశారు. ఆ విధంగా ఆధునిక రసాయనశాస్త్రానికి పునాదులు వేశారు. యూరపులో రసాయనశాస్త్ర పురోగతికి మూలపురుషుడు జాబిర్ బిన్ హయ్యాన్.


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com




**మనిషికి ఆరోగ్యం అనేది ఇది చాలా ముఖ్యం.** అందుకే మన పెద్దలు ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. ఆరోగ్యం అనేది అల్లాహ్ ప్రసాదించిన గొప్ప వరం. అందువల్ల మనం ఎల్లప్పుడూ ఆరోగ్యాన్ని కాపాడు కుంటూ ఉండాలి. ఆరోగ్యంగా ఉన్నప్పుడు సాధారణంగా మనిషి తనకు లభించిన ఈ గొప్ప వరప్రసాదాన్ని గుర్తించడు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉంటాడు. కానీ కాస్త జ్వరం వచ్చినా తట్టుకోవడం కష్టమవుతుంది. హఠాత్తుగా ఆరోగ్యం పాడయితే అప్పుడు ఎంత గొప్ప వరాన్ని కోల్పోయాడో అర్థమవుతుంది. అందువల్ల ప్రసాదిం చిన ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ మనం అందుకు అల్లాహ్ పట్ల కృతజ్ఞతా భావంతో ఉ ండాలి. ప్రవక్త (స) ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి ఎన్నో ఇతరులు పలికారు అంతేకాదు ఎన్నో సూచనలు కూడా చేశారు వాటినే తిబ్బే నబవీ పేరుతో పిలుస్తున్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రవక్త(స) చెప్పిన సూచనలు చూద్దాం.

నిజానికి మనిషి క్షేమంగా ఉండటానికి క్షమాగుణం, దుఆల కన్నా గొప్పది ఏదీ లేదు. ప్రవక్త (స) ప్రసాదించిన అనేక ప్రవచనాల్లో ఈ వాస్తవాలు తెలుస్తున్నాయి.

ఒకసారి ప్రవక్త సహచరులు హజరత్ అబూ దర్దా రజిఅల్లాహు అన్హ్ ఇలా చెప్పారు. ఆయన ఏమన్నారంటే ఒకసారి ఆయన ప్రవక్త (స) దగ్గరకు వచ్చి, ఓ దైవప్రవక్త, నేను ఆరోగ్యంగా ఉన్నప్పుడు దైవానికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ ఉంటాను కానీ నా ఈ స్థితి నుంచి అనారోగ్యం పాలైతే అప్పుడు సహనం వహించడం అంటే నాకు చాలా ఇష్టం అని అని చెప్పుకున్నారు. ఈ మాటలు విన్న ప్రవక్త (స) ఆయనకు జవాబిస్తూ ఏమన్నారంటే మీరు మీతో పాటు దైవప్రవక్త కూడా ఆరోగ్యంగా క్షేమంగా ఉండాలని కోరుకుంటాను అన్నారు.

దీన్నిబట్టి అర్థమయ్యేది ఏమిటంటే ఆరోగ్యం అనేది అల్లాహ్ ప్రసాదించిన గొప్ప వరం. కాబట్టి అనారోగ్యాన్ని ఇష్టపడకూడదు. ఆరోగ్యాన్ని కోరుకోవాలి. దైవ ప్రవక్త స్వయంగా కూడా ఆరోగ్యాన్ని కోరుకునే వారు. అయితే కష్టాల్లోనూ అనారోగ్యం లోను దైవంపై నమ్మకంతో సహనం వహించాలి దైవ ప్రవక్తలు, దైవ దాసులు ఎల్లప్పుడు ప్రతి కష్టంలోనూ ప్రతి వ్యాధిలోనూ సహనాన్ని వహించేవారు. వ్యాధి నుంచి ఆరోగ్యాన్ని ప్రసాదించాలని దైవాన్ని కోరుకునేవారు. ఆ విధంగా వారంతా ఈ వ్యాధిలో సహనం వహించడం ద్వారా దైవ ప్రసన్నత పొందే ప్రయత్నాలు చేసే వారు. వ్యాధికి గురైనపుడు - "కరుణామయుడైన దైవమా, ఓ అల్లాహ్ ఈ వ్యాధిని నా కొరకు స్వస్థత సౌభాగ్యాలను ఇచ్చేదిగా మార్చు" అని ప్రార్థించేవారు. కాబట్టి జబ్బు పడినప్పుడు సహనం వహించాలి స్వస్థత కలిగినప్పుడు కృతజ్ఞతలు చెప్పాలి.

ఆరోగ్యం గురించి ప్రవక్త (స) ఇలా అన్నారు - "ఆరోగ్యం సిరి సంపదలు దైవం ఇచ్చిన వరప్రసాదాలు. ప్రజలు సాధారణంగా వీటి విషయంలో మోసానికి నిర్లక్ష్యానికి గురవుతుంటారు".

హదీసు గ్రంథం తిర్మిజిలో ఉన్న ఒక హదీసు ప్రకారం ప్రవక్త

అనుచరుల్లో ఒకరు ప్రవక్త వద్దకు వచ్చి. "ఓ ప్రవక్తా నమాజ్ తర్వాత నేను ఏ దుఆ చేస్తే మంచిది అని అడిగారు. దానికి ప్రవక్త జవాబిస్తూ ఆరోగ్యంగా క్షేమంగా ఉండటాన్ని నీవు కోరుకో" అని చెప్పారు. ఆ అనుచరులు మళ్ళీ అడిగితే "నీవు ఇహలోకం లోను పరలోకంలోనూ క్షేమంగా ఉండడాన్ని కోరుకో" అన్నారు. కాబట్టి వ్యాధుల నుంచి కాపాడుకోడానికి మనం దుఆ చేస్తూ, అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ, దాంతో పాటు ప్రవక్త (స) సూచించిన విధంగా చికిత్స పద్ధతులు కూడా పాటించడం మంచిది.

## వ్యాధుల రకాలు

మనిషి గుండెకు రెండు రకాల వ్యాధులు వస్తాయని దివ్యఖుర్ఆన్ చెబుతోంది. అందులో ఒక రకం అనుమానాలు, సందేహాల వ్యాధి. రెండవది కోరికలు వాంఛల వ్యాధి. ఈ రెండింటి గురించి దివ్యఖుర్ఆన్ ప్రస్తావించింది.

"వారి హృదయాలకు ఒక రోగం (అనుమానం, కాపట్యం అనే రోగం) పట్టుకుంది. అల్లాహ్ ఆ రోగాన్ని మరింత అధికం చేశాడు." (దివ్య ఖుర్ఆన్ 2:10)

దివ్య ఖుర్ఆన్ మరో చోట ఇలా చెప్పింది : "మానసిక వ్యాధిగ్రస్తులు (కాపట్యం అనే రోగం ఉన్నవారు), సత్య విరోధులు "ఈ విచిత్రమైన వాక్కుకు అర్థమేమై ఉంటుంది?" అని అనాలని. (దివ్య ఖుర్ఆన్ 74:31)

తమ వ్యవహారాలను చక్కదిద్దుకోడానికి దివ్య ఖుర్ఆన్, ప్రవక్త సంప్రదాయాలను ప్రాతిపదికలు చేసుకోని వారి గురించి అల్లాహ్ ఏమన్నాడంటే, "దైవప్రవక్త వారి మధ్య ఉన్న వ్యాజ్యం విషయంలో తీర్పు చెప్పటానికి వారిని అల్లాహ్ వైపునకూ, ప్రవక్త వైపునకూ రమ్మని పిలిచినప్పుడు, వారిలోని ఒక ప్రత్యర్థి వర్గం విముఖత చూపుతుంది. కాని ఒకవేళ సత్యం వారికి అనుకూలంగా ఉంటే, దైవప్రవక్త వద్దకు పెద్ద విధేయులు మాదిరిగా వచ్చేస్తారు. వారి హృదయాలకు (కపట) రోగమేదైనా తగిలిందా? లేదా వారు సంశయంలో పడిపోయారా? లేదా అల్లాహ్, ఆయన ప్రవక్త తమకు అన్యాయం చేస్తారని వారికి భయమా? అసలు విషయ మేమిటంటే, అన్యాయపరులు స్వయంగా వారే."

(దివ్య ఖుర్ఆన్ 24:48-50)

ఇది హృదయాల్లో ఉండే అనుమానం అనే వ్యాధి. కాపట్యం అనే వ్యాధి. నష్టపోతామనే భయం

అలాగే అల్లాహ్ హృదయాల్లో ఉండే కోరికలు వాంఛల వ్యాధి గురించి కూడా చెప్పాడు. ఈ వ్యాధి వల్ల వ్యభిచారం, అక్రమ సంబంధాల రుగ్మతలు పెరుగుతాయి.

"ఓ ప్రవక్త భార్యలారా! మీరు సాధారణ స్త్రీల వంటి వారు కారు. మీరు అల్లాహ్‌కు భయపడేవారు అయితే, తగ్గు స్వరంతో మాట్లాడకండి, ఎందుకంటే దుష్ట మనస్సు గల వ్యక్తి ఎవడైనా వ్యామోహ పడవచ్చు. కాబట్టి స్పష్టంగా, సూటిగా మాట్లాడండి." (దివ్య ఖుర్ఆన్ 33:32)

## మనిషి శరీరంపై దాడి చేసే భౌతిక వ్యాధులు

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: "ఒకవేళ ఏ అంధుడైనా, ఏ కుంటి వాడైనా, ఏ రోగి అయినా (ఎవరి ఇంట్లోనైనా అన్నం తినివేసి నట్లయితే) అది దోషం కాదు." (దివ్య ఖుర్ఆన్ 24-61)

ఈ దివ్య ఖుర్ఆన్ వాక్యాలు మనిషికి వచ్చే అనేక రోగాల గురించి, ముఖ్యంగా హజ్ యాత్ర చేస్తున్నప్పుడు, ఉపవాసాలు ఉంటున్న ప్పుడు వుజు చేసినప్పుడు వచ్చే రోగాల గురించి ప్రస్తావించాయి. ఈ వాక్యాల్లో ఎంతో జ్ఞానముంది. దివ్య ఖుర్ఆన్‌లోని గొప్ప వివేకాన్ని, వివేచనను వీటి వల్ల అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు మానవాళికి అవసరమైన మార్గదర్శకత్వం అందించడానికి దివ్య ఖుర్ఆన్ ఎంతో తగిన గ్రంథమనేది కూడా దీనివల్ల అర్థమవుతుంది.

వైద్యశాస్త్రంలో మూడు ముఖ్యమైన నియమాలున్నాయి. అవి ఒకటి : ఆరోగ్యాన్ని కాపాడడం. రెండవది : నష్టం కలిగించే వాటిని నివారించడం (అంటే రోగనిరోధకశక్తి పెంచడం). మూడవది: నష్టదాయకమైన వాటిని శరీరం నుంచి తొలగించడం. ఈ మూడు మౌలిక నియమాల గురించి అల్లాహ్ ప్రస్తావించాడు. ముఖ్యంగా హజ్ యాత్ర, ఉపవాసాలు, వుజూల నేపథ్యంలో వీటిని ప్రస్తావించడం జరిగింది.

"కాని మీలో ఎవరైనా వ్యాధిగ్రస్తులయితే లేక ప్రయాణంలో ఉంటే, వేరే దినాలలో ఆ ఉపవాస దినాలను పూర్తిచెయ్యాలి." (దివ్య ఖుర్ఆన్ 2:184)



వ్యాధిగ్రస్తుడైన వ్యక్తి తన వ్యాధి కారణంగా ఉపవాసాన్ని విరమించే అనుమతి అల్లాహ్ ఇచ్చాడు. అలాగే బాటసారి ప్రయాణంలో ఉన్నప్పుడు తన సత్తువను కాపాడుకోడానికి, ఆరోగ్యాన్ని కాపాడుకోడానికి ఉపవాసం విరమించే అనుమతి అల్లాహ్ ఇచ్చాడు. ప్రయాణంలో ఉన్నప్పుడు మనిషి శారీరకంగా అలసి పోతాడు. శరీరం శక్తిని పుంజుకోవడానికి అవసరమైన పోషకాహారం తీసుకోవలసి ఉంటుంది. అందువల్లనే బాటసారికి ఉపవాసం విషయంలో మినహాయింపు ఇవ్వడం జరిగింది. ఉపవాసం నుంచి మినహాయింపు ఉండడం వల్ల బాటసారి శారీరక బడలికను తట్టుకుని అవసరమైన శక్తిని పొందే ఆహారం తీసుకోగలడు.

అల్లాహ్ ఈ విషయం గురించి ఏమన్నాడంటే- “మీలో ఎవరైనా వ్యాధిగ్రస్తులై లేదా తల బాధకు లోనై (ఖుర్బానీ తన స్థానానికి చేరక మునుపే) శిరోముండనం చేయించుకుంటే దానికి పరిహారంగా ఉపవాసం ఉండాలి లేక దానధర్మాలు చెయ్యాలి లేక ఖుర్బానీ ఇవ్వాలి.” (2:196)

కాబట్టి అల్లాహ్ వ్యాధిగ్రస్తులకు మినహాయింపు ఇచ్చాడు. అలాగే హజ్ యాత్ర చేస్తున్నప్పుడు ఇహ్రాం ధరించిన స్థితిలో శిరోముండనం నిషిద్ధం కాని పేను బాధ ఉన్నవారు, లేదా నెత్తికి సంబంధించిన సమస్య ఉన్నవారికి శిరోముండన చేయించుకునే అనుమతి ఇచ్చాడు. నెత్తిపైన జుట్టు పెరగడం వల్ల ఇలాంటి సమస్యలున్న వారికి ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతాయి. ఆ సమస్యల నివారణకు శిరోముండనం చేయించుకునే అనుమతి అల్లాహ్ ప్రసాదించాడు. శరీరం నుంచి హానికారమైన వాటిని తొలగించడానికి ఇదొక ఉదాహరణ. ఇహ్రాం స్థితిలో శిరోముండనం చేయరాదనేది సాధారణ నియమం. కాని అనారోగ్యస్థితిలో దానికి మినహాయింపు లభించింది.

అదేవిధంగా శరీరంలోని హానికారకమైన వాటిని శరీరం నుంచి తొలగించవలసి ఉంటుంది. ముందు జాగ్రత్త చర్యలకు సంబంధించి అంటే ఆహార తదితర విషయాలకు సంబంధించిన ముందు జాగ్రత్తల గురించి అల్లాహ్ ఏమన్నాడంటే:

“మీరు ఎప్పుడైనా అస్వస్థులైతే లేక ప్రయాణంలో ఉంటే లేక మీలో ఎవరైనా మలమూత్ర విసర్జనం చేసి వుంటే లేక మీరు మీ స్త్రీలను తాకివుంటే, మీకు నీరు లభ్యంకాని పక్షంలో, పరిశుభ్రమైన మట్టిని ఉపయోగించండి, దానితో మీ ముఖాలను, చేతులను రుద్దుకొనండి.” (దివ్య ఖుర్ఆన్ 4:43)

వ్యాధిగ్రస్తుడైన వ్యక్తి నీటితో వుజూ చేసుకోవడం వల్ల అతని ఆరోగ్యం దెబ్బతినేదయితే మట్టితో తయమ్ముమ్ చేసుకునే అనుమతి అల్లాహ్ ఇచ్చాడు. ఈ ఖుర్ఆన్ వాక్యాలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, వ్యాధినిరోధక చర్యలు తీసుకోవాలని సూచించే వాక్యాలు. శరీరాన్ని హానికారకమైన అంశాల నుంచి కాపాడాలని చెప్పే వాక్యాలు.

ఈ విధంగా అల్లాహ్ వైద్యానికి సంబంధించిన మూడు మౌలిక నియమాలను నొక్కి చెప్పాడు.

వైద్య విధానాలన్నింటిలోను ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ చూపించిన ప్రవక్త వైద్యం మెరుగైనది మేలైనదని నిరూపించే అనేక ఉదాహరణలున్నాయి. అవి ఇప్పుడు చూద్దాం.

గుండెకు వచ్చే వివిధ వ్యాధులు, అవి ఆధ్యాత్మికమైనవి అయినా లేక భావావేశాలకు సంబంధించినవి అయినా వాటికి చికిత్స కేవలం దైవప్రవక్తలు మాత్రమే అందించారు. విశ్వప్రభువు, సృష్టికర్త గురించిన జ్ఞానం సంపాదించినప్పుడు, సృష్టికర్త పేర్లు, గుణగణాలు, ఆయన ఆదేశాల గురించి తెలిసుకున్నప్పుడు గుండెకు సాంత్వన లభిస్తుంది. దైవప్రసన్నతకు ప్రాముఖ్యం ఇచ్చినప్పుడే గుండె ఆరోగ్యంగా ఉంటుంది. మనిషి తన స్వంత వాంఛలు, కోరికలను వదిలి దైవప్రసన్నత కోసం ప్రయత్నిస్తూ, దేవుడు నివారించిన, నిరోధించిన, నిషేధించిన వాటికి దూరంగా ఉంటూ దేవుని ఆగ్రహానికి దూరంగ ఉంటూ దైవప్రసన్నత కోసం ప్రయత్నిస్తున్నప్పుడు అతని గుండె ఎంతో ఆరోగ్యాన్ని ఆనందాన్ని పొందుతుంది. ఈ పద్ధతి తప్ప గుండె ఆరోగ్యం, సాంత్వన, జీవితం మరొకటి లేదు. ఇది దైవప్రవక్తలు చూపించిన మార్గాన నడవడం ద్వారా మాత్రమే పొందగలం.

దైవప్రవక్తలు సూచించిన పద్ధతిలో కాకుండా వేరేవిధంగా గుండెను ఆరోగ్యంగా ఉంచుకోగలమని ఎవరైనా భావిస్తే అది చాలా పొరబాటు. ప్రాపంచిక కోరికలు తీర్చుకోవడం వల్ల సంతృప్తి లభించవచ్చును. కాని ఇది గుండెకు సంబధించిన ఆరోగ్యం కాదు. ఇలా కోరికల వెనుక పరుగెత్తడం వల్ల ప్రమాదం కొని తెచ్చుకోవడమే అవుతుంది. ఈ రెండింటి మధ్య తేడా గుర్తించలేని వారు మానసికారోగ్యం కోసం అలమటిస్తుంటారు. అలాంటి వారు చీకటిలో జారిపోతారు. ❖

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
సహజీవన భావనల పొదరాయి
గీటురాయి
వారపత్రిక

# డబ్బు సంపాదించడానికి, ఖర్చు చేయడానికి 10 నియమాలు

- ముహమ్మద్ అజ్గర్ అలీ

**ఇస్లాం**లోని ప్రాథమిక నియమాలలో ఒకటి చట్టబద్ధమైన (హలాల్) మార్గాల ద్వారా డబ్బు సంపాదించాలి. అంటే నిషిద్ధ కార్యకలాపాలను ఆశ్రయించకుండా సంపదను సంపాదించాలి, అంటే:

**రిబా (వడ్డీ) :** ఖురాన్ వడ్డీ ఆధారిత లావాదేవీలను స్పష్టంగా నిషేధిస్తుంది. వడ్డీ నుండి పొందిన ఏదైనా లాభం ఇస్లాంలో హరామ్ (నిషిద్ధం)గా పరిగణించబడుతుంది.

**జూదం, బెట్టింగ్ :** జూదం వంటి ఊహాజనిత ప్రమాదాన్ని కలిగి ఉన్న కార్యకలాపాలు నిషేధించబడ్డాయి.

**నిషేధించబడిన పరిశ్రమలు :** మద్యం, డ్రగ్స్ లేదా ఇతర హరామ్ వ్యాపారాల నుండి వచ్చే ఆదాయం అనుమతించబడదు.

"ఓ విశ్వసించిన వారలారా! వడ్డీని రెట్టింపు చేసి తినకండి,. దైవానికి భయపడండి." (ఖురాన్ 3:130)

## ఖర్చులో నియంత్రణ

➢ ఇస్లాం ఖర్చుతో సహా జీవితంలోని అన్ని అంశాలలో మితంగా, సమతుల్యతను ప్రోత్సహిస్తుంది. ముస్లిములు దుబారా (ఇస్రాఫ్), నీచత్వం రెండింటినీ నివారించాలని సూచించారు. ఇస్లాం సంతులిత విధానాన్ని సమర్థిస్తుంది, సంపదను అతిగా తినకుండా తెలివిగా వినియోగిస్తుంది.

➢ "మరియు వారు ఖర్చు చేసినప్పుడు, దుబారాగా లేదా లోపభూయిష్టంగా ఉండరు, వారి ఖర్చు ఆ రెంటికి మధ్య సమతౌల్యంలో ఉంటుంది." (ఖురాన్ 25:67)

## జకాత్ (తప్పనిసరి దాతృత్వం)

ఇస్లాం మూల స్తంభాలలో ఒకటైన జకాత్ అనేది ఆర్థిక స్థోమత కలిగిన ప్రతి ముస్లిం తప్పనిసరిగా ఇవ్వాల్సిన దాతృత్వం. ఇది పేదలు, అనాథలు, అప్పుల్లో ఉన్నవారితో సహా, నిస్సహాయుల కోసం ఉద్దేశించింది. జకాత్ సంపదను శుద్ధి చేస్తుంది.

➢ "మరియు నమాజును నెలకొల్పండి, జకాత్ ఇవ్వండి, రుకూ చేసే వారితో మీరు రుకూ చేయండి." (ఖురాన్ 2:43)

## సదఖా

తప్పనిసరి జకాత్ కాకుండా, ముస్లింలు స్వచ్ఛంద దానం అయిన సదఖాను ఇవ్వమని ప్రోత్సహింపబడతారు. సదఖా డబ్బు ఇవ్వడం, ఆహారం ఇవ్వడం లేదా మంచి మాట ఇవ్వడం వంటి ఏ రూపంలో నైనా కావచ్చు. సదఖా సమాజ సంరక్షణను ప్రోత్సహిస్తుంది, ఆర్థిక అసమానతలను తగ్గిస్తుంది.

## వృధాను నివారించడం

సంపదతో సహా వనరులను వృధా చేయడాన్ని ఇస్లాం గట్టిగా నిరుత్సాహపరుస్తుంది. డబ్బును బాధ్యతారహితంగా లేదా ప్రయోజనం లేని వాటిపై ఖర్చు చేయడం పాపపు చర్యగా పరిగణించ బడుతుంది. అల్లాహ్ అందించిన దీవెనలకు వ్యతిరేకంగా వ్యర్థం అనేది అతిక్రమంగా పరిగణించబడుతుంది.

## కుటుంబం, ఆధారపడిన వారికి మద్దతు

ఇస్లాం ఒకరి కుటుంబం, వారిపై ఆధారపడిన వారి ఆర్థిక అవసరాలను తీర్చడానికి బలమైన ప్రాధాన్యతనిస్తుంది. ఆహారం, ఆశ్రయం, దుస్తులు, విద్య వంటి వారి ప్రాథమిక అవసరాలను తీర్చడం వారి ఒక ముస్లిం బాధ్యత.

➢ "మీలో ఉత్తములు వారి కుటుంబాలలో ఉత్తమంగా ఉంటారు, నేను నా కుటుంబానికి ఉత్తముడిని." (అల్-తిర్మిజీ 3895)

## సంపదను కూడబెట్టుకోవడం నిషేధం

సంపదను కూడబెట్టుకోవడం, నిర్మాణాత్మక ప్రయోజనాల కోసం లేదా సామాజిక సంక్షేమం కోసం ఉపయోగించకుండా దానిని పనిలేకుండా ఉంచడం ఇస్లాం నిరుత్సాహపరుస్తుంది. సంపద సమాజంలో చెలామణి కావాలని, ఇతరులకు ప్రయోజనం చేకూర్చాలని, అల్లాహ్‌ను సంతోషపెట్టే విధంగా ఉపయోగించాలని ఇస్లాం బోధిస్తుంది.

➢ "ఎవరు బంగారాన్ని, వెండిని పోగుచేసి, అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయరో – వారికి బాధాకరమైన శిక్ష గురించిన వార్తలను తెలియజేయండి." (ఖురాన్ 9:34)

## రుణాలు

ఇస్లాం రుణం తీసుకోవడాన్ని అనుమతిస్తుంది. కానీ అప్పులు వెంటనే తిరిగి చెల్లించాలని చెప్పింది. ప్రవక్త ముహమ్మద్(స) అప్పులు తిరిగి చెల్లించే ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. నిజమైన అవసరం లేకుండా రుణాలు తీసుకోవడాన్ని నిరుత్సాహపరిచారు. రుణాలపై వడ్డీ నిషేధించబడింది. రుణగ్రహీతపై భారం పడని విధంగా రుణాలు ఇవ్వడానికి ముస్లింలను ప్రోత్సహించారు.

## పెట్టుబడి, వ్యాపార నీతి

ఇస్లాం వ్యవస్థాపకత, పెట్టుబడి, వాణిజ్యాన్ని ప్రోత్సహిస్తుంది, అయితే ఈ కార్యకలాపాలు నైతికంగా నిర్వహించబడాలి. వ్యాపార లావాదేవీలు న్యాయంగా, పారదర్శకంగా ఉండాలి. ఎలాంటి మోసం లేదా దోపిడీకి అనుమతి లేదు.




## జమ్మూకశ్మీర్ సీఎంగా ఒమర్ ప్రమాణం

జమ్మూకశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం కొలువుతీరింది. శ్రీనగర్‌లోని షెరి ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కొత్త సీఎంగా ఒమర్ అబ్దుల్లాతో ప్రమాణం చేయించారు. ఉప ముఖ్యమంత్రిగా జమ్మూకు చెందిన సురిందర్ చౌధరి, మరో నలుగురు మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక తదితరులు హాజరయ్యారు. ఇండియా బ్లాక్ తరపున సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్, సీపీఎం నేత ప్రకాశ్ కారత్, సీపీఐ నేత డి.రాజా, డీఎంకే నాయకురాలు కనిమొళి, ఎన్సీపీ శరద్ పవార్ వర్గం తరపున సుప్రియా సులే, పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ తదితరులు హాజరయ్యారు. నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వానికి బయట నుంచి మద్దతు ఇవ్వాలని నిర్ణయించిన కాంగ్రెస్ కేబినెట్‌లో చేరలేదు. కాంగ్రెస్ మూడు మంత్రి పదవులు ఆశించగా ఒకటి మాత్రమే ఇస్తామని ఒమర్ స్పష్టం చేయడంతో ప్రభుత్వానికి వెలుపలి నుంచి మద్దతివ్వాలని కాంగ్రెస్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. 2019 ఆగస్ట్ 5న ఆర్టికల్ 370 రద్దు చేశాక ఇటీవల జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ 42 స్థానాల్లో నెగ్గింది. ఎన్సీ కూటమిగా పోటీ చేసిన కాంగ్రెస్ 6 చోట్ల గెలిచింది. ఐదుగురు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు, ఒక ఆప్ ఎమ్మెల్యే, ఒక సీపీఎం ఎమ్మెల్యే ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వానికి మద్దతిచ్చారు. దీంతో మొత్తం 55 మంది ఎమ్మెల్యేల బలం ప్రభుత్వానికి ఉంది. జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో 90 నియోజకవర్గాలకు పోటీ జరగ్గా ఐదుగురిని లెఫ్టినెంట్ గవర్నర్ నామినేట్ చేస్తారు. దీంతో సభలో మొత్తం సభ్యుల సంఖ్య 95 కానుంది.

## కమిటీ చైర్మెన్ తీరుపై జోక్యం చేసుకోండి : లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ప్రతిపక్ష ఎంపీలు లేఖ

వక్ఫ్ (సవరణ) బిల్లును ప్యానెల్ చైర్మన్ జగదాంబికా పాల్ పరిశీలించిన సంయుక్త కమిటీ సమావేశంలో 'పార్లమెంటరీ ప్రవర్తనా నియమావళిని తీవ్రంగా ఉల్లంఘించడం'పై ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. వక్ఫ్ అవకతవకల ఆరోపణలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కె. రెహమాన్ ఖాన్‌లతో సహా పలువురు ప్రతిపక్ష నేతల పేర్లను పేర్కొన్న కర్ణాటక రాష్ట్ర మైనారిటీల కమిషన్ మాజీ చైర్మన్ అన్వర్ మణిప్పాడి తీరుతో పలువురు ప్రతిపక్ష ఎంపీలు కమిటీ సమావేశాన్ని బహిష్కరించారు. సమావేశాలు జరుగుతున్న తీరుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాశారు. వక్ఫ్ (సవరణ) బిల్లుపై జాయింట్ కమిటీ మణిప్పాడిని 2012 కర్ణాటక వక్ఫ్ స్కామ్ నివేదిక సందర్భంలో ముసాయిదా చట్టంపై తన అభిప్రాయాలను వినడానికి అనుమతించింది. అయితే "ఆయన కమిటీ ముందు ప్రవేశపెట్టిన నోట్‌లో వక్ఫ్ (సవరణ) బిల్లు 2024పై ఎటువంటి పరిశీలనలు లేవు. బదులుగా, ఆ నోటు రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గేతో సహా కర్ణాటక కాంగ్రెస్ నాయకుల పై రాజకీయ ప్రేరేపిత ఆరోపణలతో నిండి ఉంది" అని లేఖలో పేర్కొన్నారు. తమ నిరసనలను తెలియ జేయడానికి కమిటీ సభ్యులకు తగిన సమయం ఇవ్వడానికి పాల్ నిరాకరించారని ప్రతిపక్ష సభ్యులు తెలిపారు. "ఈ విషయంలో మీ తక్షణ జోక్యాన్ని మేము అభ్యర్థిస్తున్నాం. ద్వైపాక్షికంగా, పార్లమెంటరీ నిబంధనలను సమర్థించాల్సిన బాధ్యతను కమిటీ చైర్మన్‌కు మీరు గుర్తు చేస్తారని ఆశిస్తున్నాం" అని ప్రతిపక్ష సభ్యులు అన్నారు.

## దుర్భర పేదరికంలో 12.9 కోట్ల మంది : ప్రపంచ బ్యాంకు నివేదిక

దేశాన్ని పేదరికం వెంటాడుతూనే ఉంది. తాజాగా 2024- ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం దేశంలో 12.9 కోట్ల మంది ప్రజలు దుర్భర పేదరికంలోనే బతుకీడుస్తున్నారు. వీరి ఆదాయం రోజుకు రూ.181 కన్నా తక్కువగా ఉందని నివేదిక పేర్కొంది. అయితే, 1990లో 43.1 కోట్ల మంది పేదలు ఉండగా వీరి సంఖ్య తగ్గుతూ వచ్చిందని తెలిపింది. 2021 నాటికి 3.8 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడినట్టు ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. మధ్యస్త ఆదాయ దేశాల్లో రోజుకు రూ.576 సంపాయించే వారిని పేదలుగా పరిగణిస్తూ రూపొందించిన ఈ నివేదికలో భారతదేశ పరిస్థితి దారుణంగా ఉందని తెలిపింది. రోజుకు రూ.576 సంపాయించే వారిని ప్రామాణికంగా తీసుకున్నప్పుడు 1990ల కన్నా భారత్‌లో పేదరికం దారుణంగా ఉందని పేర్కొంది. దీనికి కారణం జనాభా పెరుగుదలేనని వివరించింది. ఇటీవల భారత ప్రభుత్వం విడుదల చేసిన గృహ వినియోగం, వ్యయ సర్వేలో ఈ వివరాలను వెల్లడించలేదని పేర్కొంది. కాగా, ఆఫ్రికా సహా పలు దేశాల్లో 2030 నాటికి దుర్భర పేదరికాన్ని నిర్మూలించాలన్న లక్ష్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించకపోతే.. ఈ లక్ష్యాన్ని చేరుకోవడం కష్టసాధ్యమని నివేదిక వెల్లడించింది. పేదరిక నిర్మూలనా చర్యలు ప్రపంచ వ్యాప్తంగా చాలా మందగమనంలో ఉన్నాయని ఆక్షేపించింది.




## ఆర్థిక అభద్రతలో అతివలు : ఐరాస

ప్రపంచ వ్యాప్తంగా 200 కోట్ల మంది మహిళలు ఉపాధి సహా ఆర్థికంగా ఎలాంటి వెసులుబాట్లు లేక ఆర్థిక అభద్రతలో జీవిస్తున్నారని ఐక్యరాజ్యసమితి (ఐరాస) మహిళా నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యంగా ఆఫ్రికా సహా పలు దేశాల్లో ఈ పరిస్థితి ఉందని వివరించింది. సామాజిక భద్రత కల్పించడంలోనూ మహిళలు లింగ వివక్షను ఎదుర్కొంటున్నట్టు తెలిపింది. సామాజిక భద్రతగా పేర్కొనే నగదు లబ్ధి, నిరుద్యోగ భృతి, పింఛన్లు, ఆరోగ్య సంరక్షణ, ఉపాధి కల్పన, ఉద్యోగాలు వంటివి కడు దూరంలో ఉన్నాయని పేర్కొంది. అక్టోబరు 17 అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐరాస ఈ నివేదికను విడుదల చేసింది. అభివృద్ధి చెందిన దేశాల్లో 2015 తర్వాత పరిస్థితిలో కొంత మార్పు కనిపించినా.. లింగ సమానత్వం, సామాజిక భద్రతలు మాత్రం లక్ష్యాలను ఇంకా చేరుకోలేదని పేర్కొంది.

## లెబనాన్‌లోని ప్రతి చిన్నారిపై ఇజ్రాయెల్ దాడుల ప్రభావం.. ఆందోళన వ్యక్తం చేసిన యూనిసెఫ్

ఇజ్రాయిల్ గత మూడు వారాలుగా లెబనాన్‌పై జరుపుతున్న కర్కశ దాడుల్లో లెబనాన్‌లోని ప్రతి చిన్నారి ప్రభావితమయ్యారని యూనిసెఫ్ ఆందోళన వ్యక్తం చేసింది. దాదాపు నాలుగు లక్షల మందికిపైగా లెబనాన్ చిన్నారులు నిరాశ్రయులయ్యారని యునిసెఫ్ పేర్కొంది. నిరాశ్రయులైన చిన్నారులు కిక్కిరిసిన శిబిరాల్లో ఉంటున్నారని, ప్లాస్టిక్ షీట్‌తో వేరుచేసిన గదుల్లో మూడు నాలుగు కుటుంబాలతో కలిసి తలదాచుకుంటున్నారని హ్యూమనిటేరియన్ యాక్షన్స్ ఫర్ యునిసెఫ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టెడ్ చైబాన్ చెప్పారు. 12 లక్షల మందికిపైగా చిన్నారులు విద్యకు దూరమయ్యారని, లెబనాన్ ఓ తరాన్ని కోల్పోతున్నదని టెడ్ చైబాన్ అన్నారు. యుద్ధంలో ధ్వంసం కావడంవల్ల, శరణార్థి శిబిరాలుగా వినియోగించడంవల్ల లెబనాన్‌లో పాఠశాలలు పిల్లలకు అందుబాటులో లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్షిపణులు, తుపాకుల మోతలతో నిరాశ్రయులైన చిన్నారులు తీవ్రమైన హింసాత్మక పరిస్థితులను ఎదుర్కొన్నారని, ఏ పెద్ద శబ్దమైనా వారిని భయభ్రాంతులకు గురిచేస్తోందని చెప్పారు. మనం సంరక్షణ చర్యల్లో ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నామని, కానీ అక్కడ ప్రభావం తీవ్రంగా ఉందని టెడ్ పేర్కొన్నారు. ఇజ్రాయిల్ దాడులతో 100కు పైగా ప్రాథమిక ఆరోగ్య సంరక్షణా కేంద్రాలు ధ్వంసమయ్యాయని అన్నారు. 12 ఆస్పత్రులు పాక్షికంగా పని చేస్తున్నాయని, దీర్ఘకాలం పనిచేసే పరిస్థితులు లేవని చెప్పారు. మంచినీటి మౌలిక సదుపాయం కూడా దాడులతో ప్రభావిత మైందని, సుమారు 3.50 లక్షల మందికి నీటిని అందించే 26 నీటి శుద్ధి ప్లాంటులు దెబ్బతిన్నాయని అన్నారు. పౌర మౌలిక సదుపాయాలను రక్షించాలని అంతర్జాతీయ సమాజానికి టెడ్ పిలుపునిచ్చారు. ఇజ్రాయెల్ దాడులతో లెబనాన్‌లో ఇప్పటివరకు 2,300 మందికిపైగా మరణించారని లెబనాన్ ఆరోగ్య శాఖ తెలిపింది.

## అర్థశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

అర్థశాస్త్రంలో ప్రతిష్టాత్మక నోబెల్ పురస్కారాన్ని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది. 2024 సంవత్సరానికి గాను ముగ్గురికి దీనిని అందించనుంది. దేశాల మధ్య సంపదలో అసమానతలపై పరిశోధనలకుగానూ డారెన్ ఏస్‌మోగ్లు, సైమన్ జాన్సన్, జేమ్స్ ఎ. రాబిన్‌సన్ ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఇటీవలనే వైద్యశాస్త్రంలో విజేతలను ప్రకటించగా.. తర్వాత వరుసగా భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, సాహిత్యం విభాగాల్లో పురస్కారాలను ప్రకటించారు. నోబెల్ శాంతి బహుమతిపై ప్రకటన చేయగా.. తాజాగా అర్థశాస్త్రంలో ముగ్గురు ఆర్థికవేత్తల పేర్లను వెల్లడించారు. డారెన్, సిమోన్.. అమెరికాలో కేంబ్రిడ్జ్‌లోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందినవారు కాగా.. షికాగో యూనివర్సిటీలో రాబిన్‌సన్ పరిశోధనలు చేస్తున్నారు.

## కంటి స్కాన్‌తో డయాబెటిస్ నిర్ధారణ!

మనిషి కండ్లను చూసి అతనికున్న వ్యాధులను నిర్ధారించవచ్చంటున్నారు అమెరికాకు చెందిన పలు యూనివర్సిటీల పరిశోధకులు. వివిధ రకాల వ్యాధుల ప్రాథమిక దశను కంటి చూపులోనే తెలుసుకోవచ్చని చెప్తున్నారు. మధుమేహం, గుండె జబ్బులు, కిడ్నీ వైఫల్యం, రక్తహీనత, అల్జీమర్స్ వంటి వ్యాధులు సంబంధించిన ఆధారాలు కంటి స్కాన్ ద్వారా కనుగొనవచ్చని పేర్కొంటున్నారు. కంటిలో జరిగే సూక్ష్మమైన మార్పులను బట్టి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకోవచ్చని తెలిపారు. ఆ సూక్ష్మమైన మార్పులను గుర్తించే అధునాతన ఆప్తాల్మోస్కోప్‌ను (కనుపాప లోపలి భాగాన్ని పరిశీలించే పరికరం) అభివృద్ధి చేసేందుకు పరిశోధకులు ప్రయత్నిస్తున్నారు. దీనిని రూపొందించేందుకు పరిశోధకులు 2000 సంవత్సరం నుంచి ప్రయత్నిస్తున్నారు. ఆప్తాల్మోస్కోప్ కంటి వెనుక భాగాన్ని పరిశీలించగలదు. ఆ భాగంలోని ఎర్ర రక్త కణాల కదలికలను వీరు ఆ పరికరం సాయంతో చూడగలిగారు.

# ముద్దాయిగా ఖలీఫా

## ముహమ్మద్ వహీదుద్దీన్

**హజ్రత్ అబ్బాస్ (రజి)** ఇల్లు మస్జిదె నబవీ (మదీనా పట్టణంలో) ప్రక్కనే ఆనుకుని ఉండేది. ఆ ఇంటి చూరు మస్జిద్ వైపు ఉండేది. ఎప్పుడయినా వర్షం పడితే చూరు నుంచి నీళ్ళు పడేవి. దాని చినుకులు నమాజ్ చేసే వారిమీద పడేవి. హజ్రత్ ఉమర్ (రజి) నమాజీలపై నీళ్ళు పడడం చూసి ఆ చూరును అక్కడి నుంచి తొలగించారు. హజ్రత్ అబ్బాస్ (రజి) తన ఇంటి మీది చూరు తొలగించి ఉండడం చూసి ఇది ఎవరు చేశారని వాకబు చేశారు. నమాజీలపై నీటి చుక్కలు పడడం చూసి అమీరుల్ మోమినీన్ దీన్ని తొలగించారని ఆయనకు తెలిసింది. హజ్రత్ అబ్బాస్ (రజి) దాని గురించి ఖాజీ వద్ద ఫిర్యాదు చేశారు. అప్పుడు ఖాజీ ఉబై బిన్ కాబ్ (రజి). ఖాజీ ఆదేశం మేరకు అప్పటి పాలకులు ఉమర్ ఫారుఖ్ (రజి) న్యాయస్థానానికి వచ్చారు. అప్పుడు ఉబై బిన్ కాబ్ వేరే విచారణల్లో లీనమయి ఉన్నారు. అది చూసి ఉమర్ ఫారుఖ్ (రజి) బయటే నిరీక్షించసాగారు. ఆయన విచారణ సమయం వచ్చింది. ఉమర్ ఫారుఖ్ (రజి) లోపలికి వచ్చి ఏదో చెప్పబోయారు. అంతలోనే ఖాజీ (అప్పటి న్యాయమూర్తి, జడ్జి) అయిన ఉబై బిన్ కాబ్ కల్పించుకుని 'మొదట ఫిర్యాది వాదించాలి. ఆ తరువాత ప్రతివాది వాదించాలి' అనగానే ఉమర్ ఫారుఖ్ (రజి) మౌనంగా ఉండిపోయారు. ఉబై బిన్ కాబ్ (రజి) అబ్బాస్ (రజి)ని ఏం జరిగిందో చెప్పమని ప్రశ్నించారు. అబ్బాస్ (రజి) 'నా ఇంటి చూరు మొదటి నుంచి మస్జిదె నబవీ వైపుగానే ఉంది. ప్రవక్త కాలంలోనూ, అబూ బక్ర్ (రజి) కాలంలోనూ అలాగే ఉంది. కాని ఉమర్ ఫారుఖ్(రజి) నేను లేనప్పుడు, నా అనుమతి లేకుండా చూరును తొలగించారు. నాకు న్యాయం చేయండి' అని విన్నవించుకున్నారు. కాబ్ (రజి) 'మీరు నిశ్చింతగా ఉండండి, మీకు న్యాయం జరుగుతుంది' అన్నారు. ఉమర్ ఫారుఖ్ (రజి) వైపు తిరిగి మీరు చెప్పండి, మీరు అబ్బాస్ (రజి) ఇంటి చూరు ఎందుకు తొలగించారు' అని అడిగారు. ఆ కాలపు పరిపాలకులు ఉమర్ ఫారుఖ్ (రజి) బోనులో నిల్చుని 'అబ్బాస్ (రజి) ఇంటి చూరు మస్జిదె నబవీ వైపుగా ఉంది. వర్షం పడినప్పుడు చూరు నుంచి నీరు కారుతుంది. అది మస్జిద్‌లోని నమాజ్ చేసే వారి మీద పడుతుంది. దాని వల్ల నమాజీలు ఇబ్బంది పడుతున్నారు. అందుకని నేను దాన్ని తొలిగించాను' అన్నారు. కాబ్ (రజి) అబ్బాస్ (రజి) వైపు తిరిగి మీరు ఇంకా ఏమయినా చెప్పదలిచారా? అని అడిగారు. దానికి అబ్బాస్(రజి) 'ప్రవక్త (స) తన చేతి కర్రతో గుర్తు పెట్టి ఇచ్చారు. నేను అక్కడే ఇల్లు కట్టుకున్నాను. చూరు విషయానికి వచ్చేసరికి ప్రవక్త (స) 'బాబాయ్ మీరు నా భుజాల మీదికి ఎక్కి చూరు పెట్టుకోండి అన్నారు. నేను ఆయన భుజాల మీద ఎక్కడానికి నిరాకరించాను. కాని ప్రవక్త(స) ఎంతగానో బ్రతిమాలిన తరువాత నేను ఆయన భుజాల మీద ఎక్కి ఈ చూరు తగిలించాను అన్నారు. ఆయన(స) ఆదేశం మేరకే నేను అక్కడ చూరు పెట్టాను' అన్నారు. ఇది విని ఉమర్ ఫారుఖ్ (రజి) అవాక్కయ్యారు. ఏడ్వడం ప్రారంభించారు. ఆయనకు ప్రవక్త(స) గుర్తుకు వచ్చారు. ఆ కాలపు దృశ్యాలన్నీ కళ్ళ ముందు కదలాడసాగాయి.

న్యాయస్థానంలో అప్పటి పాలకులు అయిన ఉమర్ ఫారుఖ్ (రజి) తలదించుకుని నిల్చుని ఉన్నారు. ఆయన పేరు వింటేనే పెద్ద పెద్ద రాజులు భయకంపితులయి పోతారు. అలాంటిది న్యాయస్థానంలో తల దించుకుని ఉన్నారు. ప్రవక్త(స) ఆ చూరు పెట్టమని స్వయంగా ఆదేశించారని నాకు తెలియదు. పదండి ఆనాడు మీరు ఏ విధంగా ప్రవక్త(స) భుజాల మీద నిలబడి దాన్ని పెట్టారో ఈ రోజు నా భుజాల మీద నిలబడి దాన్ని పెట్టండి అని అబ్బాస్ (రజి)ని కోరారు. అందరి సమక్షంలో, అందరు చూస్తుండగా అబ్బాస్ (రజి) ఉమర్ ఫారుఖ్ (రజి) భుజాల మీద ఎక్కి ఏ విధంగానయితే ప్రవక్త (స) కాలంలో పెట్టారో అదే విధంగా ఆ చూరు మళ్లీ అక్కడ పెట్టారు.

ఉమర్ ఫారుఖ్ (రజి) తీరుకు ఎంతగానో ప్రభావితులయిన అబ్బాస్ (రజి) తన ఇంటిని మస్జిద్ నబవీ కోసం అంకితం చేశారు.

తు
ది
గీ
టు




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**